



## జలవనరుల శాఖ ఈఈ సస్పెన్షన్

### నిడదవోలు ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావుపై వేటు



పాలకొల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం కార ణంగా గోదావరి వెస్ట్రన్ డివిజన్ (నిడదవోలు) కార్యని ర్వాహక ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యేశ్వర రావును సస్పెండ్ చేస్తూ జలవన రుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానా యుడు ఆదేశాలు జారీ చేశారు.ఈ మే రకు కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓఅండ్ఎం నిధులు విడుదల చేసినప్పటికీ తగిన సమ యంలో పనులు చేపట్టకపోవడం వల్ల గోదావరి వెస్ట్రన్ ప్రధాన కాలువ పరిధిలోని బ్యాంక్ కెనాల్స్ నిడదవోలు - నరసాపురా నికి సంబంధించిన నియోజకవర్గాల్లో సాగునీటి కొరత ఏర్ప డింది. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించి ఈఈ సుబ్ర హ్మణ్యేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. సాగునీటి నిర్వహణలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించిన చర్యలు తప్పవన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగానే ఈఈని సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు.








### దంచికొట్టిన వాన

వరుణుడు దంచికొట్టాడు.. చూస్తుండగానే ముంచేశాడు.. శుక్రవారం రాత్రి 9 గంటలకు ఎవరి పనిలో వాళ్లున్నారు.. ఆకాశం ఉరుముతున్నా పట్టించుకోలేదు..అంతే వరుణుడు ఒక్కసారిగా వచ్చాడు.. ఇలా ముంచాడు.. రాజమహేంద్రవరంలో శ్యామలా సెంటర్‌లో అరగంట సేపు ఆగకుండా కురిసిన వానతో పరిసరాలు ఇలా జలమయంగా మారాయి. ఆ తరువాత నగరమంతా వాన కురిసింది.

\- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం





### చినుకులా రాలి.. వరదలై పోయి..

చినుకులా రాలి.. వరదలై పోయి.. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద అచ్చంగా ఇదే కనిపించింది. ఒక్కసారిగా పడిన వానతో చినుకు చినుకు ఏకమై ఇలా వరదలా మారింది.. ఉవ్వెత్తున ఎగసిపడుతూ గోదారమ్మ ఒడిలో కలిసిపోయింది.. సుమారు అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా వాననీరు వరదలా రోడ్లపై ముంచెత్తింది.

# ప్రిపరేషన్!

## రైస్ కార్డులకు.. రైట్ రైట్



(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు భారీగా వెల్లువెత్తాయి. గత వైసీపీ హయాంలో కొత్త కార్డుల జారీ లేక పోవడంతో వేలాది మంది పేదలు ఈసురోమ న్నారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా అప్పట్లో ఏరేశారు. దీంతో ప్రభు త్వం మారాక కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 1.53 లక్షల మంది అర్జీలు అం దించారు. ఇందులో ఏకంగా 1.10 లక్షల మంది తమకు ఉన్న కార్డుల్లో అదనపు సభ్యులను చేర్చాలంటూ దరఖాస్తులు ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి దాదాపుగా ప చ్చజెండా ఊపారు. త్వరలోనే లబ్ధిదారులకు ప్ర భుత్వం కొత్తకార్డులను మంజూరు చేయనుంది.

### నాడు ఉన్నవీ పీకేశారు..

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అ మలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసే శారు. రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కా ర్డులను భారీగా ఏరేశారు. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అం దులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటి లో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపి గుట్టుగా క్షేత్ర స్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. 17,500 మంది కార్డు దారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటిని రద్దుచేసేశారు. దీంతో ప్రతి పక్ష హోదాలో నాడు టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది.అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టా లను పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు.రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేప ట్టడానికి పచ్చజెండా ఊపారు. దీంతో గత మే 14 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సచివాల యాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైనవారు, ఇప్పటివరకు రేషన్ కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది.

### 1,53,341 అర్జీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 1,53,341 మంది నుంచి అర్జీలు వచ్చాయి. కొత్తకార్డులు కావాలంటూ 14,197 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఉన్న కార్డు ల్లో కొత్తగా సభ్యులను చేర్చాలంటూ 1,10,587 మంది విజ్ఞప్తులు చేశారు. వచ్చిన అర్జీల్లో అత్య ధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన మొత్తం అర్జీల్లో 90 శాతానికిపైగా అధి కారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు అన్ని అర్జీలను అధికారు లు పరిగణనలోకి తీసుకుని ప్ర భుత్వానికి జాబితా కూడా పంపా రు. త్వరలో కొత్త కార్డుల జారీ చేయడానికి వీలుగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. దీంతో త్వరలోనే కార్డులు అందుతాయి.

- రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడిగా 1,53,341 వినతులు
- వైసీపీలో కార్డుల్లో కోత
- కూటమి ప్రభుత్వంలో అవకాశం
- భారీగా వెల్లువెత్తిన విజ్ఞప్తులు
- చేర్పులకు 1,10,587 దరఖాస్తులు
- అధికారుల గ్రీన్‌సిగ్నల్
- ఏటీఎం కార్డులా రైస్ కార్డులు

### ఏ జిల్లాకు ఎన్ని..

- కాకినాడ జిల్లా నుంచి 62,988 మంది ఉ న్నారు. ఉన్న కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలని 46,729 మంది, రేషన్‌కార్డు విభజించాలని 6,091, కొత్త కార్డులకు 5,170, చిరునామా మార్పునకు 1,986 మంది అర్జీలు అందించారు.
- కోనసీమలో మొత్తం 45,080 దరఖాస్తులు రాగా చిరునామా మార్పునకు 1,751, కొత్త సభ్యులను చేర్చాలంటూ 32,254 పేర్ల రద్దుకు 1,275 కొత్తకార్డులకు 4,268, కార్డు విభజించాలని 4,536 అర్జీలు వచ్చాయి.
- తూర్పుగోదావరి జిల్లా నుంచి 45,273 అర్జీలు వచ్చాయి. తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 31,604 మంది మొర పెట్టుకున్నారు. కార్డులు విభజించాలంటూ 4,664 మంది, కొత్త కార్డులు కావాలని 4,759 మంది అర్జీలు అందించారు.

### ఇక డిజిటల్ కార్డులు

చంద్రబాబు అంటేనే ఐటీ ముఖ్యమంత్రి అంటారు.. ప్రస్తుతం రేషన్ కార్డుల్లోనూ ఆ మార్పు చూపిస్తున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇవి పూర్తిగా ఏటీఎం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలు కూడా తెలపవచ్చు.





## దండాలు.. దండాలు వేగులమ్మ తల్లి

గోకవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రా మంలో మాతృశ్రీ వేగులమ్మ తల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభించా రు..గ్రామంలోని మహిళలంతా బోనాల తో ఊరేగారు.శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించా రు. చల్లంగ చూడమని వేడుకున్నారు.

## డీలర్ల కమీషన్ పెంచండి

### రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల కమీషన్ ను పెంచి న్యాయం చేయాలనిఏపి రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూనపరెడ్డి ఎస్‌వీ రామారావు విజ్ఞప్తి చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్ర వారం విలేకరులతో మాట్లాడారు. డోర్ డెలివరీ చేసే రేషన్‌కు కిలో బియ్యానికి రూ.3 వరకు కమీషన్ పెంచాలని కోరా మన్నారు. కమిషన్ పెంపుదల విషయ మై సీఎం చంద్రబాబు, సివిల్ సప్లయి స్ కమిషనర్‌ను కలిసి కేజీ బియ్యానికి రూ.1 నుంచి రూ.3లోపు పెంచాలని వినతిపత్రం అందించామన్నారు. వారు స్పందించి రూపాయి 60 పైసల నుంచి రూ.2ల వరకు పెంచే అకాశం ఉంద న్నారు. రేషన్ డీలర్ల శ్రమను గుర్తించి అదనపు పని దినాలకు అదనపు ఆదాయాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశా రు. సమావేశంలో సంఘం జనరల్ సెక్రటరీ మునుగా గిరిజారావు, జిల్లా అధ్యక్షుడు బీవీఎస్.సాయిరెడ్డి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నల్లా వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం అర్బన్ అధ్యక్షుడు నమ్మి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో దర్శనమిస్తున్న ధవళేశ్వరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి

# ఆనంద హరితం!




(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం మరో హామీ నెరవే ర్చింది.. గ్రీన్ ట్యాక్స్ తగ్గించి వాహనదారులకు పెద్ద ఊరటనిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారిగా పెంచిన హరిత పన్ను వాహనదా రుల తలకు మించిన భారమైంది. రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వందల్లో ఉండే గ్రీన్‌ట్యాక్స్‌ను వేలల్లో పెంచిం ది.. పర్యావరణం పేరుతో పది టన్నుల లారీ లపై రూ.ఐదు వేలు, 30 టన్నుల లారీలపై రూ.15 వేలు విధించడంతో లారీ యజమాను లు గగ్గోలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఈ ట్యాక్స్ తగ్గి స్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కూట మి ప్రభుత్వం వచ్చాక హరిత పన్ను విష యమై లారీ యజమానుల వినతిని సర్కారు పరిశీలించింది. (గ్రీన్ ట్యాక్స్) హరితపన్ను భా రాన్నితగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

### వైసీపీలో పిండుడే..

గత ప్రభుత్వంలో వివిధ వాహనాలకు ఏటా గరిష్ఠంగా రూ.20 వేల వరకు గ్రీన్ ట్యాక్స్ విధించగా కూటమి ప్రభుత్వం దీనిని సవరించి ఏడాదికి రూ.1500, రూ.3000 చొప్పున రెండు శ్లాబుల్లో వసూలు చేసేలా కొత్త విధానం తెచ్చింది. సరకు రవాణా (లా రీలు, వ్యాన్లు), ప్రజా రవాణా (బస్సులు, మినీ బస్సులు) ఏడేళ్ల తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. గతంలో ఈ పన్ను కేవలం రూ.200 మాత్రమే ఉండేది. కాలం చెల్లిన వాహనాలను తగ్గించా లని దీనిని పెంచుకునేలా కేంద్రం వెసులు బాటు కల్పించింది. దీనిని ఆసరాగా తీసుకున్న జగన్ ప్రభుత్వం 2022 జనవరి నుంచి రాష్ట్రంలో హరిత పన్నును భారీగా పెంచింది. ఏడు నుంచి పదేళ్ల వాహనాలకు సగం త్రైమా సిక పన్ను విలువ, పదేళ్ల నుంచి 12 ఏళ్ల నాటికి ఒక త్రైమాసిక పన్ను విలువ, 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయా వాహనాల కేటగిరీ, వాటి వయసు బట్టి కనిష్ఠంగా రూ.800 మొదలుకొని గరి ష్ఠంగా రూ.20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసింది. పాసిం జర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్ ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.ఆరు వేలు, చివరికి ఆటోలు, బైక్‌లు, క్రేన్ లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచారు. పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళన లు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించు కోలేదు. ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీ లు ఉండగా, వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లాలో 2.94 లక్షలు, తూ ర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరిత పన్ను పిండేసింది.

- నెరవేరిన మరో హామీ
- గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు
- వైసీపీలో రూ.20 వేలు
- ప్రస్తుతం రెండు స్లాబ్‌లు
- రూ.1500, రూ.3 వేలు
- సర్కారు ఉత్తర్వులు జారీ

### జిల్లాల్లో తగ్గనున్న భారం

ప్రస్తుతం హరిత పన్నుపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడి జిల్లా వాహనాలపై పన్నుభారం తగ్గ నుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదా వరిజిల్లాలో 2.10 లక్షల వాహనాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.ఏడు కోట్ల పన్ను భారం తగ్గనుంది.

# నాడు రివర్స్.. నేడు టెండర్స్!

## సాగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులు



పోలవరం ఎడమ కాలువ

**పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) పనులు సాగుతున్నాయి. 2008లో ప్రారంభ మైన కాలువ పనులు 17 ఏళ్లయినా నేటికీ సాగుతూనే ఉన్నా యి. భూసేకరణ తదితర సమస్యలు వెన్నాడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించు కోకపోవడంతో ఐదేళ్లూ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మళ్లీ పనులకు టెండర్లు పిలిచి దారిలో పెట్టింది.**

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి నీటిని విశాఖ ఇండస్ట్రియల్, సాగు తాగునీటి అవసరాలు తీర్చాలనే లక్ష్యంతో పోల వరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసి) నిర్మిస్తున్నారు.పోలవరం ప్రాజెక్టు ఆలస్యం కావడంతో 2014లో తెలుగుదేశం ప్రభుత్వం సీతానగరం మండలంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. అది నేటికీ ఆరంభమే కాలేదు. 2019లో అధికా రంలోకి వచ్చిన వైసీపీ పురుషోత్తపట్నం ఎత్తి పోతల పథకాన్ని కోర్టులో వివాదాస్పదం చేయ డంతో పాటు, ఎడమ ప్రధాన కాలువ పనులు వదిలేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం దీనిపై మళ్లీ దృష్టి పెట్టింది. 8 ప్యాకేజీలుగా పనులు విభ జించి టెండర్లు పిలిచి పనుల మొదలు పెట్టిం ది. వాస్తవానికి జూన్ నెలాఖరుకు కాలువ పనులు పూర్తి చేసి పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా పోలవరం ఎల్ ఎంసీలోకి నీటిని పంపి ఏలేరు, విశాఖ అవస రాలకు నీరందివ్వాలనేది ప్రభుత్వ ఆలోచన. కానీ ప్రస్తుతం భూసేకరణ, ఇతర సమస్యల వ ల్ల ఆలస్యమయ్యే పరిస్థితులున్నాయి.

### 4 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం..

పోలవరం ప్రాజెక్టు దగ్గర నుంచి విశాఖ పట్నం వరకూ 214.808 కిలోమీటర్ల పొడవున ఈ ఎల్ఎంసీని నిర్మిస్తున్నారు. 4 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం. తూర్పుగోదావరి జిల్లా రాజా నగరం నియోజకవర్గం పరిధిలో 1.15 లక్షల ఎకరాలు. కాకినాడ జిల్లా పరిధిలో 1.21 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందివ్వాలి. కాకినాడ నియోజకవర్గంలో 0.42 లక్షలు, జగ్గంపేట నియోజకవర్గంలో 0.0998 లక్షలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 0.450 లక్షలు, తుని పరిధిలో 0.240 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడం లక్ష్యం. అనకాపల్లి జిల్లా పరిధిలో 1.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలి. ఈ పోలవరం ఎడమ ప్రధాన కాలువ సామర్థ్యం 17,561 క్యూసెక్కులు.అంటే సెకనుకు ఈ కాలువ నుం చి 17,561 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. కాలువకు పోలవరం ప్రాజెక్టు నుంచి 108.248 టీఎంసీల నీటిని కేటాయిస్తారు. అందులో ఇరిగేషన్‌కు 84.808 టీఎంసీలు, మంచినీరు, పరిశ్రమల అవసరాలకు 23.44 టీఎంసీల నీటి కేటాయింపు అవసరమని అంచనా వేశారు.

### రివైజ్డ్ అంచనాలతో పనులు..

వాస్తవానికి పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) నిర్మాణానికి రూ.1954.74 కోట్లతో జీవో 104ను 2008 మే 30న జారీ చేశా రు.ఆ తరువాత 2016 డిసెంబర్ 6న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.3645.24 కోట్ల రి వైజ్డ్ అంచనాతో జీవో నంబర్ 117 జారీ చేసిం ది. 2019 ఫిబ్రవరి 10న కాలువ పనులు, భూ సేకరణ మొత్తం అంచనాలు వేసి రూ.6205.24 కోట్ల రివైజ్డ్ అంచనాతో జీవో 21 జారీ చేసింది. భూసేకరణకు రూ.2002.55 కోట్లు, పనులకు రూ.4202.69 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకూ రూ.2987.44 కోట్ల పనులు పూర్తయ్యా యి. 2024 సెప్టెంబర్ 3న జీవో 319 జారీ చేస్తూ పనులను 8 ప్యాకేజీలుగా విభజించా రు.ఈ కాలువలో ఎర్త్ వర్కు 12 లక్షల 79 వేల 600 క్యూబిక్ మీటర్లు చేయాల్సి ఉంది. లైనింగ్ 214.808 కి.మీ 133.446 కి.మీ మేర జరిగింది. స్ట్రక్చర్ల నిర్మాణ పనులు 385 జరగాల్సి ఉండగా 99 పనులు చేపట్టాల్సి ఉన్నాయి. 8 స్ట్రక్చర్లను తొలగించడానికి ప్రతిపాదించారు. భూసేకరణ 10,500 ఎకరాలకు 10,306 ఎకరాలు సేకరిం చారు.ప్యాకేజీ 5 పరిధిలో 11.37 ఎకరాలు, ప్యా కేజి 7 పరిధిలో 9.485 ఎకరాలు సేకరించాల్సి ఉంది.భూసేకరణకు ఇప్పటి వరకూ రూ.530. 04 కోట్లు ఖర్చు చేశారు.పాత ఏజెన్సీలను రద్దు చేసి కొత్త ఏజెన్సీలకు పనులిచ్చారు.8 ప్యాకే జీ ల్లో చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

- గత 17 ఏళ్లుగా సాగదీత
- నేటికీ పూర్తికాని పనులు
- వైసీపీలో తీవ్ర నిర్లక్ష్యం
- పైసా కూడా విదల్చని వైనం
- దృష్టి పెట్టిన కూటమి సర్కారు
- 8 ప్యాకేజీలుగా విభజన



కొండగుంటూరులో పట్టుకున్న లారీలు

## అక్రమ మట్టి తరలింపు

### టిప్పర్లను అడ్డుకున్న జనసైనికులు

రాజానగరం,జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలను రాజానగరంలో గురువారం అర్ధరాత్రి జనసైనికులు అడ్డుకుంటే.. ఆ తరువాత అధికారులు వదిలేశారు. కలవచర్ల లోని పోలవరం కాలువగట్టు గత కొంతకా లం గా కొల్లగొడుతున్నారు. దీంతో జన సైని కులు గురువారం రాత్రి సుమారు 12 లారీలను అడ్డుకుని అధికారులకు సమా చారం ఇచ్చారు. పట్టుకున్న లారీలను తహశీల్దార్ కార్యాలయంలోకి తరలించా రు. దీనిపై తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి మాట్లాడారు. సూర్యారావు పేట సమీపంలో మాల్ నిర్మాణంలో భాగంగా వచ్చిన మట్టిని మరొక ప్రాం తంలోని సొంత స్థలంలోకి తరలిస్తున్న 4 లారీలు ఉన్నాయన్నారు. పోలవరం కాలు వ నుంచి మట్టిని తరలిస్తున్న మరో 6 లారీలకు అనుమతులు ఉండడంతో విడి చిపెట్టామన్నారు.మరో రెండు లారీలకు ఛలానాలు కట్టించుకుని విడిచిపెట్టడం జరిగిందని తహశీల్దార్ బదులిచ్చారు.

### 3 టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

దివాన్‌చెరువు, జూలై18 (ఆంధ్రజ్యో తి) : రాజానగరం మండలం కొండగుం టూరులోని ప్రభుత్వభూమి సర్వే నెంబ రు 642లో జరుగుతున్న అక్రమ గ్రావెల్ త్రవ్వకాలపై మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆ కస్మికంగా తనిఖీలు చేశారు. ఎక్స్‌కవేట ర్, గ్రావెల్ లోడ్ కలిగిన 3 టిప్పర్లను అ ధికారులు సీజ్ చేశారు. వాహనాలను కొండగుంటూరు ఆర్ఐకి స్వాధీనపరచా మని అధికారులు తెలిపారు.తనిఖీలో మైనింగ్‌శాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. విఘ్నేశ్వరుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి. జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

# శాకంబరీ నమోస్తుతే



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ దేవత కనక మహాలక్ష్మి అమ్మవారు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి గ్రామ దేవత వనువులమ్మ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండ గ్రామ దేవత ముత్యాలమ్మ

ఆషాఢ శుక్రవారం సందర్భంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలుచోట్ల అమ్మవార్లు శాకంబరిగా దర్శనమిచ్చారు. వందల కిలోల కూరగాయలు, ఆకు కూరలతో దేవతామూర్తులను అలంకరించగా భక్తులు దర్శించుకుని పులకించారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకంబరిగా పూజిస్తే కలిగే ప్రయోజనాలను పండితులు వివరించారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఇందుపల్లి గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారు

# ఆయిల్‌పామ్‌పై రైతుల మొగ్గు

ఆయిల్‌పామ్ సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా ఈ పంటను సాగు చేయాలని ప్రభుత్వం విస్తృత ప్రచారం సాగించడంతో పాటు పలు రాయితీలు అందిస్తోంది. దీంతో నీటి లభ్యత తక్కువ, ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో వరికి బదులుగా ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.

- వరి సాగుకు ప్రత్యామ్నాయం
- ఉద్యానవన శాఖ ద్వారా రాయితీలు
- విస్తృత ప్రచారం చేస్తున్న ప్రభుత్వం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

మెట్ట, మైదాన ప్రాంతాల్లోనూ ఆయిల్‌పామ్ విస్తీర్ణం గణనీయంగా పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేపట్టింది. ఉద్యానవన శాఖ ద్వారా ప్రచారం సాగిస్తోంది. ఉద్యానవన శాఖ ద్వారా సాగుకు, ఇందుకు అవసరమైన యంత్ర పరికరాలపై అందించే సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు దిగుబడులు వచ్చిన తర్వాత కచ్చితమైన మార్కెట్ సౌకర్యం ఉంటుందనే భరోసా కల్పిస్తోంది. వరి అధికంగా పండించే కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లాల్లో వరి సాగు తగ్గించి ఆయిల్‌పామ్ వైపు దృష్టిసారించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో మండలాల వారీగా టార్గెట్లు విధించినప్పటికీ ఇప్పుడు సాధ్యమైనంత వరకు ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ చేసేలా చూడాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు.

గతంలో నీటి లభ్యత లేని ప్రాంతాల్లోనే ఎక్కువగా ఆయిల్‌పామ్‌ను సాగు చేసేవారు. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లోని మెట్ట మండలాల్లోనే దీని విస్తీర్ణం అధికం. గోదావరి, ఏలేరు, పీబీసీ, పంపా, తాండవ, పుష్కర ఆయకట్టు ప్రాంతాల్లోనూ ఇప్పుడు సాగు ప్రారంభమైంది. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఇటీవల ఒక ఎన్ఆర్ఐ వైద్యుడు తనకు గల పది ఎకరాల్లో వరి సాగు మాని ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు. ఇదే రీతిలో పలు ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన రైతుల్లో మొదలైంది. అయితే దిగుబడి రావడానికి ఎక్కువ సమయం వేచిచూడటం, అప్పటివరకు పంటపై ఎటువంటి ఆదాయం ఉండకపోవడం ఒక మైనస్‌గా మారింది. అయితే ఆయిల్‌పామ్ మొక్కల మధ్యలో కాయగూరలు, అపరాలు, ఇతర పంటలను అంతర పంటలుగా సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చని ఉద్యానవన శాఖాధికారులు చెప్తున్నారు. ఏడవ ఏడాది నుంచి హెక్టార్‌కు సగటున రూ.2.50 లక్షలు నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం వస్తుందంటున్నారు. 25 సంవత్సరాలు పాటు దీర్ఘకాలంగా కొనసాగే పంట కావడంతో ఒకసారి మొక్కలు నాటితే ప్రతి ఏటా వరి మాదిరిగా పంట వేసే అవసరం ఉండదని వివరించారు..



గొల్లప్రోలు మండలంలో సాగవుతున్న ఆయిల్‌పామ్

**నూతన సాగుపై రాయితీలు:** వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు హెక్టారుకు (2.50 ఎకరాలు) ఎన్ఎంఈవో-ఓపీ పథకం కింద రూ.29వేలు సబ్సిడీ లభిస్తోంది. 9 ఇంటు 9 మీటర్ల దూరంలో హెక్టారుకు కనీసం 143 మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఈ దిగుమతి నాటును పెద్దాపురం పతంజలి సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని ఉద్యానవన శాఖాధికారులు తెలిపారు. ఇదే సంస్థ రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తోంది. అంతర పంటలుగా కాయగూరలు, అపరాలు సాగుకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. పామాయిల్ దిగుబడి వచ్చేదాకా అంతర పంటల ద్వారా ఆదాయం వస్తుంది.

ఆయిల్‌పామ్ పంటకు డ్రిప్ ఇరిగేషన్ తప్పనిసరి. ఈ పరికరాలను ఎస్సీ, ఎస్టీ రైతులకు నూరు శాతం సబ్సిడీపై, ఐదు ఎకరాల లోపు రైతులకు 90శాతం, 5-10 ఎకరాల రైతులకు 70శాతం, పది ఎకరాలు పైబడిన రైతులకు 50శాతం సబ్సిడీపై సరఫరా చేస్తారు. ఈ సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తుంది. అదే విధంగా సాగులో అవసరమైన చాప్ కట్టర్ యూనిట్‌కు రూ.50వేలు, ట్రాక్టర్‌తో ట్రాలీ యూనిట్‌కు రూ.2లక్షలు, అల్యూమినియం పోర్టబుల్ ల్యాడర్‌కు రూ.5వేలు, మోటారైజ్డ్ చిసెల్‌కు రూ.15 వేల వరకు ప్రస్తుతం రాయితీ ఇస్తున్నారు.

**ఏలేరు, పీబీసీ ఆయకట్టులోనూ ...**

ఏలేరు, పీబీసీ, పుష్కర ఆయకట్టులోనూ ఆయిల్‌పామ్ సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాల్లో కొత్తగా 58 హెక్టార్లలో ఆయిల్‌పామ్ పంట వేశారు. ఇప్పటికే పంట ఉన్న విస్తీర్ణం 1246 హెక్టార్లు కాగా... ఈ ఏడాది 350 హెక్టార్లల్లో అదనంగా సాగు చేస్తారని భావిస్తున్నారు.



ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు

## స్థిర ఆదాయానికి ఆయిల్‌పామ్ సాగు చేయండి



వై.సోమరాజశేఖర్, ఉద్యానవన శాఖాధికారి, పిఠాపురం

స్థిరమైన అధిక ఆదాయం కోసం ఆయిల్‌పామ్ సాగు చేస్తే మేలు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లో వరికి బదులుగా దీనిని సాగు చేస్తే తక్కువ నీటితోనే పంట పండించవచ్చు. దిగుబడులు వచ్చే వరకు అంతర పంటలుగా కాయగూరలు, కందులు, అపరాలు సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చు. ఆయిల్‌పామ్ సాగుకు, ఇందుకు అవసరమైన పరికరాలకు ప్రభుత్వం పలు రాయితీలు కల్పిస్తోంది. రైతులు వీటిని వినియోగించుకోవాలని కోరుతున్నాము. ఆయిల్‌పామ్ సాగుపై అందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

# ద్రాక్షారామలో నేడు సీతారాముల కల్యాణం

● కల్యాణ రథం ఊరేగింపు ● 21తో ముగియనున్న సప్తసప్తాహం



పురవీధుల్లో ఊరేగుతున్న సీతారాముల కల్యాణరథం

ద్రాక్షారామ,జూలై18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం భద్రాది సీతారాములు కల్యాణం జరుగుతుంది. ప్రసన్నాంజనేయస్వామి బాలభక్త సమాజం ఆధ్వర్యంలో గత నెల 2న ప్రారంభమైన సప్తసప్తాహం ఈనెల 21న ముగియనుంది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి సోమవారం వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శనివారం భద్రాది సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భద్రాది సీతారాముల కల్యాణ రథం శుక్రవారం సాయంత్రం ద్రాక్షారామ చేరుకుంది. భద్రాది నుంచి సీతారాముల కల్యాణం జరిపించేందుకు వైదిక బృందం, ఆలయ సిబ్బంది వచ్చారు. కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తారు.

**కల్యాణరథం ఊరేగింపు**

శుక్రవారం రాత్రి సీతారాముల కల్యాణరథాన్ని ద్రాక్షారామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా సప్తసప్తాహం ముగింపు సందర్భంగా పూర్ణాహుతి, శాంతి కల్యాణం, సామ్రాజ్య పట్టాభిషేకం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులతో జరుగుతుంది. అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామని బాలభక్తసమాజం అధ్యక్షుడు బోనం శ్రీను తెలిపారు.

# మరుగుదొడ్ల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 15 న్యాయస్థానాల్లో 223 మరుగుదొడ్లను కాంట్రాక్టు పద్ధతిలో నిర్వహించడానికి ఆసక్తి కలిగిన ఏజెన్సీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. 34 మంది సిబ్బందిని నియమించుకొని ఈ ఏడాది సెప్టెంబరు 1 నుంచి 2026 ఆగస్టు 31 వరకూ రాజమహేంద్రవరంలోని 59, అమలాపురం 15, కాకినాడ 46, పెద్దాపురం 13, పిఠాపురం 30, రామచంద్రాపురం 6, రాజోలు 8, కొత్తపేట 6, ఆలమూరు 9, ప్రత్తిపాడు 10, ముమ్మిడివరం 5, తుని 6, అనపర్తి 5, రంపచోడవరం 3, అడ్డతీగలలోని 2 మరుగుదొడ్లను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన ఏజెన్సీలు జూలై 25 సాయంత్రం 5గంటలలోపు తమ కొటేషన్లను సీల్డ్ కవరులో రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు కార్యాలయంలో సమర్పించాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఆయా మరుగుదొడ్ల ప్రదేశాలను పని దినాల్లో ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల మధ్య స్వయంగా వచ్చి పరిశీలించుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.

# అశోక్ గజపతిరాజును కలిసిన కోటిపల్లి దేవస్థానం సిబ్బంది



గజపతిరాజుకు స్వామి వారి ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

కె.గంగవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోవా రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోక్‌గజపతి రాజు ప్రముఖ పుణ్యక్షేత్రం కోటిపల్లి శ్రీ ఛాయాసోమేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయనను దేవస్థానం ఈవో భీమశంకరం ఆధ్వర్యంలో సిబ్బంది, అర్చకస్వాములు కలిసి శుక్రవారం విజయనగరం వెళ్లి అభినందనలు తెలియజేశారు. స్వామి వారి ప్రసాదం అందజేశారు.

# వరద తగ్గుముఖం

ధవళేశ్వరం, జూలై 18(ఆంధ్రజ్యోతి):తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం సాయంత్రం కాటన్ బ్యారేజ్ ద్వారా 46,406 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేశారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాలకు తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 7200క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం 13.30 అడుగులుగా నమోదయింది.

# ఆధునికతకు పెద్దపీట

- నూతన విద్యావిధానంతో ప్రపంచీకరణపై అవగాహన
- జేఎన్‌టీయూ మొట్ట మొదటి మహిళా వీసీ శాంతిశ్రీ పండిట్
- వర్సిటీలో ముగిసిన వర్క్‌షాప్

జేఎన్టీయూకే, జూలై 18(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకే ఏరోస్పేస్ సర్వీస్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఒకేషనల్, పబ్లిక్ డిజైన్ కోర్సులను అందించి ఆధునికతకు పెద్దపీట వేయాలని న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ(జేఎన్‌యూ) మొట్ట మొదటి మహిళా ఉప కులపతి ప్రొఫెసర్ ధూళిపూడి శాంతిశ్రీ పండిట్ అన్నారు. యూసీఈకే ఓక్ ఉత్సవాలు సందర్భంగా వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో శుక్రవారం రెండు రోజుల పాటు నిర్వహించిన రోల్ ఆఫ్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2020 ఇన్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047 వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య ఉపన్యాసకురాలిగా విచ్చేసిన శాంతిశ్రీ మాట్లాడుతూ నూతన విద్యావిధానం 36 ఏళ్ల తరువాత రూపొందించబడిందని దీని వల్ల ప్రపంచీకరణపై అవగాహన కలుగుతుందని, అంతర్జాతీయ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. పరిశ్రమలకు నైపుణ్యాలతో కూడిన వ్యక్తుల అవసరం ఎంతో ఉందన్నారు. రాబోయే యుద్ధాలను భారతీయ ఇంజనీర్లు తమ శక్తి మేరకు అన్వేషణలను సాగించి వాటిని ఎదుర్కొనేలా సన్నాహమవ్వాలని సూచించారు. అనంతరం హైదరాబాద్‌లోని ఇష్లా వీసీ ఎన్.నాగ రాజు మాట్లాడుతూ భారతదేశంలో మిలియన్‌కు 260 మంది మాత్రమే శాస్త్రీయ నిపుణులుండగా చైనాలో మిలియన్‌కు 1000 మంది ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పరిశోధనలకు ఎక్కువ నిధులు కేటాయించాలని అధ్యాపకులకు శిక్షణా తరగతులు నిర్వహించి పరిశోధనా ప్రాజెక్టులు చేపట్టేలా ప్రోత్సాహకాలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఈపీఏ మాజీ వీసీ జె.బాలగంగాధర్‌తిలక్ మాట్లాడుతూ వికసిత్ భారత్-2047గా అభివృద్ధి చెందాలంటే ఉన్నతవిద్యలో పలుమార్పులు తీసుకురావాలన్నారు. నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రాంలను ప్రారంభించాలని, నాన్ ఇంజనీరింగ్ సబ్జెక్టులను ప్రవేశపెట్టి సోషల్‌సైన్స్ టెక్నికల్ కోర్సులను కలిపి నేర్పించాలని సూచించారు. పూర్వవిద్యార్థి ఎస్ఎంకే భట్టా మాట్లాడుతూ సోలార్, న్యూక్లియర్, థర్మల్ విద్యుత్ ద్వారా గ్రీన్ ఎనర్జీని పెంపొందించాలన్నారు. ఏపీలో వనరుల కొరత లేదని పరిశ్రమలను స్థాపించుటకు భూసేకరణ చేపట్టాలన్నారు. అనంతరం రోల్ ఆఫ్ అకడమీషియన్స్ టు రియలైజ్ ద ఆబ్జెక్టివ్స్ ఆఫ్ స్వర్ణాంధ్ర వికసిత్ భారత్-2047పై ప్యానల్ చర్చ నిర్వహించారు. దీనికి జేఎన్టీయూకే పూర్వవిద్యార్థి ప్రొఫెసర్ పి.ఉదయభాస్కర్ అధ్యక్షత వహించగా ఏయూ ఉపకులపతి ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, కృష్ణా యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.రాంజీ, పూర్వ విద్యార్థులు కొండలరావు, నాగిరెడ్డి, ఇడెల్కో సీఈవో శ్రీనివాసప్రసాద్, బీటీహెచ్ స్వీడన్ డైరెక్టర్ గురుదత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ఓక్ జూబ్లీ ఉత్సవాల లోగోను అతిథులు, అధికారులతో కలిసి ఆవిష్కరించి ప్యానల్ నిపుణులను సత్కరించారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్డీ కోటేశ్వరరావు, ఓక్ ఉత్సవ కమిటీ చైర్మన్ పి.ఉదయభాస్కర్, వైస్ చైర్మన్ శ్రీనివాసకుమార్, పలువురు డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాంతిశ్రీ పండిట్‌ను సత్కరిస్తున్న దృశ్యం



ఓక్ జూబ్లీ ఉత్సవాల లోగోను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు, వర్సిటీ అధికారులు

# 21న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాసలో ఈ నెల 21న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో స్టోర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, రైటర్, పర్సనల్ సెక్రటరీ, రిసెప్షనిస్ట్, ఆడిట్ అసిస్టెంట్, టెక్నీషియన్, టెలీసేల్స్ రిప్రజెంటేటివ్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, సీఏ, ఇంటర్, బీటెక్, ఎంకాం ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు సోమవారం ఉదయం 9గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

# అనఘా దత్తక్షేత్రంలో శత చండీయాగం

పిఠాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం అగ్రహారం దత్తనగర్‌లోని శ్రీపాదవల్లభ అనఘా దత్త క్షేత్రంలో శత చండీ యాగం శుక్రవారం ప్రారంభమైంది. అంకురార్పణ, ఇతర పూజల్లో మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్తవిజయానంద తీర్థ స్వామి పాల్గొన్నారు. వేద పండితులు క్రతువులు జరిపారు. విజయానంద స్వామి చేపట్టిన చాతుర్మాస్య వ్రత దీక్ష 9వ రోజు కొనసాగింది. జైమినీ భారతంపై ప్రవచించారు.

# హాస్టల్ బాలికల ఆకలి కేకలు

- చర్మ వ్యాధులతో బాధపడుతున్న పలువురు విద్యార్థులు
- కలెక్టర్‌కు పెద్దాపురం బీసీ బాలికల వసతిగృహం విద్యార్థినుల ఫిర్యాదు
- కలెక్టర్ ఆదేశాలతో హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో శ్రీరమణి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం సుధా కాలనీలోని బీసీ బాలికల వసతిగృహంలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు ఆకలితో అలమటిస్తున్నారు. వార్డెన్ నిత్యం విద్యార్థినుల వేధించడంతో వారి బాధలు వర్ణనాతీతం. 80 మంది విద్యార్థులకు మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉండడంతో నిత్యం వారు నరకం చూస్తున్నారు. దీంతో విద్యార్థినులు తాము అనుభవిస్తున్న బాధలను కలెక్టర్ షాన్‌మోహన్ దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణం హాస్టల్‌ను తనిఖీ చేయాలని ఆర్డీవో శ్రీరమణి, ఎంపీడీవో డి.శ్రీలలితను ఆయన ఆదేశించారు. దీంతో వారు హుటాహుటిన హాస్టల్‌కు చేరుకుని విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికల బాధలు విని తల్లడిల్లిపోయారు. పైగా విద్యార్థినులు చాలా మంది చర్మవ్యాధులతో బాధపడుతున్నట్టు గుర్తించారు. తమ బాధలు చెప్పుకుందామమంటే వార్డెన్ తమని బూతులు తిట్టడంతో పాటు కొడుతోందని విద్యార్థినులు వాపోయారు. 80 మంది విద్యార్థినులకు కేవలం మూడు మాత్రమే టాయిలెట్లు ఉండడం పైగా అవి పరిశుభ్రంగా లేకపోవడంతో నిత్యం నరకం చూస్తున్నట్టు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెను ప్రకారం భోజన పెట్టడంలేదని, తమని దుర్భాషలాడుతున్నట్టు విద్యార్థినులు అధికారులకు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు.

**వార్డెన్ విశాలాక్షి సస్పెన్షన్**

బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం రాత్రి హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణమే కలెక్టర్ షాన్ మోహన్‌తో ఫోన్‌లో మాట్లాడి హాస్టల్లో జరుగుతున్న విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, చర్మ వ్యాధులకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ స్పందించి వార్డెన్ విశాలాక్షిని సస్పెండ్ చేస్తున్నట్టు తెలిపారు. అలాగే మిగిలిన సంక్షేమ వసతి గృహాలను పరిశీలించాలని ఆదేశించినట్టు తెలిపారు. అధికారులు పట్టణ, మండలంలోని దివిలి గ్రామంలో ఉన్న సంక్షేమ వసతి గృహాలను పరిశీలించారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

# ఒక్క రోజులోనే చిక్కాడు!


రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

**మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్**

**రాజోలులో పట్టుకున్న పోలీసులు**

రాజోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో గురువారం వ్యక్తి చేతిలో మహిళ దారుణ హత్యకు గురైన సంగతి పాఠకులకు విధితమే. పరారీలో ఉన్న నిందితుడు షేక్ షమ్మాను రాజోలులో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. రాజోలు సర్కిల్ పోలీసుస్టేషన్ కార్యాలయంలో సీఐ టీవీ నరేష్‌కుమార్ శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. బి.సావరం సిద్ధార్థ నగర్‌లోని ఒక అద్దె ఇంట్లో ఓలేటి పుష్ప (22), షేక్ షమ్మా (22) సహజీవనం చేస్తున్నారు. పుష్ప తన భర్తతో గొడవల కారణంగా విడిపోయి కొడుకు, అమ్మతో కలిసి నివాసం ఉంటుంది. సుమారు సంవత్సరం క్రితం నుంచి రాజోలు కోళ్లవారి గ్రూపునకు చెందిన షేక్ షమ్మాతో పుష్పకు పరిచయం ఏర్పడింది. షమ్మా చెడు అలవాట్లకు బానిసై పుష్పను డబ్బుల కోసం కొట్టేవాడని, గత కొద్ది రోజులుగా కంప్యూటర్ కోర్సు అని చెప్పి అమలాపురం తీసుకువెళుతుండేవాడని సీఐ తెలిపారు. ఈనెల 16న అమలాపురం కంప్యూటర్ కోర్సుకు వెళ్లి వస్తుండగా బోడసకుర్రు బ్రిడ్జిపై షేక్ షమ్మా డబ్బుల గురించి పుష్పతో గొడవపడి కొట్టాడు. ఇంటికి వచ్చిన తరువాత రాత్రి 10.30 గంటల సమయంలో తల్లి గంగమ్మ, తమ్ముడు పుష్పను ఎందుకు కొట్టావని షమ్మాను అడగ్గా మీరెవరు నన్ను అడగడానికి అని షేక్ షమ్మా కబోర్డులో ఉన్న చాకు తీసుకుని పుష్ప తల్లి గంగమ్మ, తమ్ముడిపై దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వెళ్లిన ఓలేటి పుష్ప ఎడుమవైపు గుండెపై చాకుతో పొడవగా విపరీతంగా రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందిందని సీఐ తెలిపారు. పుష్ప తల్లి గంగమ్మ ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న షేక్ షమ్మా కోసం గాలింపు చేపట్టారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ పర్యవేక్షణ చేస్తూ రెండు టీమ్‌లు ఏర్పాటు చేశారు. రాజోలు సీఐ నరేష్‌కుమార్, ఎస్‌ఐ రాజేష్‌కుమార్, సిబ్బంది కలిసి శుక్రవారం సాయంత్రం షేక్ షమ్మాను రాజోలులో అతడి ఇంటి వద్ద అరెస్టు చేశారు. నిందితుడిని ఒక్కరోజులోనే పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ కృష్ణారావు అభినందించారు. షమ్మాను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తామని సీఐ నరేష్‌కుమార్ చెప్పారు.

# ఆహా.. ఆషాఢం సారె

**తలుపులమ్మకు అన్నవరం దేవస్థానం నుంచి సమర్పణ**


కాకినాడ జిల్లా లోవ క్షేత్రంలో తలుపులమ్మకు సారె తీసుకొచ్చి సమర్పిస్తున్న అన్నవరం దేవస్థానం ఈవో, అధికారులు

తునిరూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాస ఆఖరి శుక్రవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు కాకినాడ జిల్లా లోవ క్షేత్రంలో గల తలుపులమ్మ అమ్మవారికి చీర, సారె సమర్పించారు. అమ్మవారికి అన్నవరం దేవస్థానం నుంచి ఈవో సుబ్బారావు చీర, సారె సమర్పించారు. వారికి ఆలయ అధికారులు మంగళవాయిద్యాలుతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఈనెల 24న అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో విశేష హోమ అభిషేకం జరుగుతుందని అధికారులు తెలిపారు.


శంఖవరం: కత్తిపూడిలో కనక దుర్గమ్మకు శుక్రవారం ఘనంగా ఆషాఢం సారె, బోనాలు సమర్పించారు.


ప్రత్తిపాడు: ధర్మవరం సూర్యారావుపేటలో దుర్గతల్లి గుడి వద్ద మహిళలు భారీ సారె సమర్పించారు.

## నెయ్యి డబ్బాలు దొంగిలిస్తుంటే పట్టివేత...

# అన్నవరంలో ఉప ప్రధాన అర్చకుడు, పరిచారకుడు సస్పెండ్


నెయ్యి డబ్బాలతో పట్టుబడిన ఉప ప్రధాన అర్చకుడు హరగోపాల్

అన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో నెయ్యి డబ్బాలను దొంగిలిస్తూ పట్టుబడిన ఉప ప్రధాన అర్చకుడు హరగోపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. సత్యదేవుడి తొలిపావంచా వద్ద కనకదుర్గ ఆలయంలో ఉప ప్రధాన అర్చక హోదా కలిగిన చిట్టెం హరిగోపాల్ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో హోమాలు, దీపారధన తదితర వాటికి వినియోగించాల్సిన 3 డబ్బాల నెయ్యిని శుక్రవారం ఎటువంటి అనుమతి లేకుండా కారులో తరలించే ప్రయత్నం చేయడంతో ఈవోకు అందిన సమాచారంతో ఆయన ఆదేశాలతో ఏఈవో భాస్కర్ హుటాహుటిన వెళ్లి నిర్ధారించి ఈవోకు నివేదించారు. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. పట్టుబడిన నెయ్యి డబ్బాల విలువ రూ.27వేలుగా అధికారులు తెలిపారు. 3 డబ్బాలను విచారణాధికారులు స్వాధీనం చేసుకుని దేవస్థానం సెంట్రల్‌స్టోర్స్‌కి తరలించారు. గతేడాది పదవీ విరమణ చేయాల్సిన సమయంలో ప్రభుత్వ జీవో కారణంగా ఆయన విధుల్లో కొనసాగుతున్నారు. ఆది నుంచి అర్చకుడు వివాదాస్పదంగానే విధులు నిర్వహిస్తుండడం విశేషం. గతంలో ఒకసారి అతడు పనిచేసే వనదుర్గ ఆలయ తాళాలు ఇంటికి పట్టుకెళ్లిన సంఘటనను సహచర అర్చకులు గుర్తుచేస్తున్నారు. అలాగే ఇదే సంఘటనలో అదే ఆలయంలో పరిచారకుడిగా పనిచేస్తున్న ఎన్ఎస్.సుబ్రహ్మణ్య కృష్ణకుమార్‌ను కూడా సస్పెండ్ చేశారు.

**ఈవో సుబ్బారావు ఉత్తర్వులు**

## ‘అన్నవరం’ సూపరింటెండెంట్‌కు ఏఈవోగా పదోన్నతి

అన్నవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అనకాపల్లి ప్రసాద్‌కు ఏఈవోగా పదోన్నతి కల్పిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం ఉద్యోగుల సంఘం నాయకుడిగా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ప్రసాద్‌కు దేవస్థానం ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

# బైక్‌లు దొంగిలిస్తున్న ముగ్గురి అరెస్టు


అన్నవరం పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

అన్నవరం/శంఖవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన ముగ్గురు జువైనల్స్ అన్నవరం పరిసర ప్రాంతాల్లో బైక్ దొంగతనాలకు పాల్పడడంతో వారిని శుక్రవారం అరెస్టు చేసినట్టు అన్నవరం ఎస్‌ఐ హరిబాబు తెలిపారు. నిందితుల నుంచి 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని వారిని రాజమండ్రి ప్రొబిషనరీ అధికారి ముందు హాజరుపరిచామని, స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ హరిబాబు చెప్పారు.



## ఒకే కుటుంబంలో నలుగురు అదృశ్యం

**పట్టుకున్న కిర్లంపూడి పోలీసులు**


అదృశ్యమైన వారిని పట్టుకున్న పోలీసులు

కిర్లంపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు, బాలుడు, బాలిక ఆత్మహత్య చేసుకుంటామని చెప్పి 2024 నవంబరు 9న అర్ధరాత్రి అదృశ్యమయారు. దీనిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు పర్యవేక్షణలో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కిర్లంపూడి ఎస్‌ఐ జి.సతీష్, సిబ్బంది గురు శ్రీ, శివప్రసాద్ మహారాష్ట్రలోని సోలాపూర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించి ఆ నలుగురిని పట్టుకున్నారు. వారిని వెతికి పట్టుకోవడంలో విశేష కృషి చేసిన ఎస్‌ఐ సతీష్ బృందాన్ని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

## కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**వ్యక్తికి తీవ్రగాయాలు**

అంబాజీపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు మలుపు వద్ద మారుతికారును ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పుల్లేటికుర్రు ఆంధ్రబ్యాంకు దాటిన తరువాత ఉన్న మలుపు వద్ద ముక్కామల నుంచి కె.పెదపూడి వైపు వెళ్తున్న కారును అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జుకావడంతో పాటు కారులో ఉన్న కె.పెదపూడి గ్రామానికి చెందిన సత్తిరాజుకు తీవ్రగాయాలయ్యాయి. అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


ప్రమాదానికి గురైన కారు

# సీపీఎస్ పరిధిలోకి తీసుకోవాలి

**కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం ధర్నా**


కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయుల ఫోరం ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానం అమలు తేదీ కంటే ముందే వెలువడిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగానికి ఎంపికైన వారిని సీపీఎస్ పరిధిలోకి తీసు కోవాలని ప్రభుత్వ ఉద్యోగులు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. డీఎస్సీ- 2003 ఉపాధ్యాయుల ఫోరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ జయరామ్ మాట్లాడుతూ సీపీఎస్‌కు ముందే నోటిఫికేషన్ విడుదల అయినప్పటికీ వివిధ కారణాల వల్ల ఉద్యోగంలోకి ఆలస్యంగా చేరిన ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ సమస్యలను గత ప్రభుత్వంలో ప్రస్తావించినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఉద్యోగులు విభాగాల వారీగా పరిశీలిస్తే విద్యాశాఖలో 7361 మంది, హోంశాఖలో 1821 మంది, గ్రూప్-1, గ్రూప్-2లో 1800 మంది ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో తమను సీపీఎస్ పరిధిలోకి తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి, ఉపాధ్యాయులు ఫోరమ్ ప్రతినిధులు జయ కృష్ణారెడ్డి, శ్రీలక్ష్మీ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

**ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు**

కాకినాడ సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల కోసం కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రత్యేకంగా నిర్వహించిన గ్రీవెన్స్‌లో జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు డీఆర్వో వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. హెల్త్‌కార్డుల కోసం కార్పొరేట్ హాస్పిటల్స్ నిర్వాహకులు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కొందరు ఉద్యోగుల బదిలీల్లో ఏర్పడిన ఇబ్బందులను తొలగించాలన్నారు. అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి అధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి పేపకాయల వెంకట కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి యెరుబండి రామ కృష్ణ, కాకినాడ నగర శాఖ అధ్యక్షుడు అరదాడి సత్తిరాజు, కార్యదర్శి డి.రామ్మూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి నాగేశ్వరరావు, ఉమ్మడి జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రవికు మార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి


మరణించిన మరియమ్మ

తాళ్లరేవు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా చొల్లంగి జాతీయ రహదారి గురజనాపల్లి సెంటరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పులపకూర మరియమ్మ (49) మృతిచెందినట్టు కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. చొల్లంగి గ్రామానికి చెందిన మరియమ్మ తన మనవరాలుని 6వ తరగతిలో చేర్పించేందుకు సీటు కోసం చొల్లంగిపేట గురుకుల పాఠశాలకు వెళ్లేందుకు గురజనాపల్లి సెంటరులో 216 రహదారిని దాటుతుండగా యానాం నుంచి వచ్చే ద్విచక్రవాహనం ఆటోను తప్పించబోయి మరియమ్మను ఢీకొంది. ఆమెను తీవ్రగాయలు కాగా అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందింది. కోరింగ ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తండ్రిపై సుత్తితో కొడుకు దాడి

**కేసు నమోదు**


గాయపడిన గంటా శ్రీను

రాయవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తనను మందలించాడని తండ్రి తలపై కొడుకు సుత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం రాయవరం ఎస్‌ఐ డి.సురేష్ బాబు తెలిపారు. కోనసీమ జిల్లా రాయవరం రాజేశ్వరకాలనీకి చెందిన గంట శ్రీను తన కుమారుడు గంటా పవన్ కల్యాణ్‌ను ప్రతిరోజు తిడుతున్నాడు. ఈనెల 17న రాత్రి శ్రీను భోజనం చేస్తున్న సమయంలో తండ్రి కొడుకులు మరోసారి గొడవపడడంతో ఆగ్రహంతో పవన్‌కల్యాణ్ తన తండ్రి శ్రీనుపై సుత్తితో తలపై విచక్షణ రహితంగా దాడి చేసి గాయపర్చాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

# చిన్నాన్నే చిదిమేశాడు!

**పదేళ్ల బాలికపై ఏడాదిగా అత్యాచారం**

**పోక్సో కేసు నమోదు**

కాకినాడ క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తండ్రి స్థానంలో ఉండాల్సిన చిన్నాన్న కామంతో కళ్లు మూసుకుపోయి వరసకు కూతురైన 10 ఏళ్ల బాలికపై ఏడాది కాలంగా అత్యాచారానికి పాల్పడుతున్న సంఘటన బయటపడింది. వివరాల్లోకి వెళితే... కాకినాడ వెంకట్‌నగర్‌కు చెందిన గాది వెంకన్న(30)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా అతడు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ ఉంటాడు. అతడి భార్యకు ఇద్దరు అక్కలున్నారు. పెద్దక్క భర్త తాగుడుకి బానిసై ఇంటిని పట్టించుకోకపోవడంతో 5వతరగతి చదువుతున్న తన పదేళ్ల కుమార్తెను చిన్న చెల్లికి అప్పగించి తాను ఇళ్ల పనులకు వెళుతూ జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో అవకాశంగా తీసుకున్న చిన్న చెల్లి భర్త వెంకన్న ఆ బాలికకు తినుబండారాలు, ఆట వస్తువులు కొనిపెడుతూ మచ్చిక చేసుకుని ఏడాది కాలంగా పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఒక వేళ ఈ విషయం ఎవరికైనా చెప్పితే చంపేస్తానని బెదిరించాడు. అయితే గురువారం వెంకన్న అత్యాచారానికి పాల్పడుతుండగా బాధితురాలి చెల్లి ఎనిమిదేళ్ల బాలిక ఆ సంఘటనను చూసి విషయాన్ని తన తల్లికి చెప్పింది. వెంటనే ఆమె గురువారం రాత్రి స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ మజ్జి అప్పలనాయుడు పోక్సో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధిత బాలికను వైద్య పరీక్షల నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్ వ్యవహరిస్తున్నారు.

## విద్యుదాఘాతానికి కార్మికుడు దుర్మరణం


విద్యుత్ స్తంభంపై మృతిచెందిన కార్మికుడు

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట-పిఠాపురం రోడ్డులో విద్యుత్ లైన్లు మార్చేందుకు ప్రైవేట్ కాంట్రాక్ట్ సిబ్బంది పనులు చేస్తుండగా డబుల్ ఫీడర్ అయిన 11 కేవీఏ విద్యుత్ లైన్‌ను తాకడంతో సామర్లకోట గణేష్‌కాలనీకి చెందిన నులకా భేతాళ్ళ(32) అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ముందుగా అందించిన సమాచారం మేరకు విద్యుత్ లైన్లు మార్చే ఫీడర్‌కు చెంది విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినప్పటికీ రెండో వైపు నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని భావించకుండా నిర్లక్ష్యంగా కాంట్రాక్టర్ వ్యవహరించడంతో విద్యుత్ ఘాతానికి కార్మికుడు భేతాళ్ళ మృతిచెందినట్టు పలువురు భావించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కాగా శుక్రవారం జరిగిన సంఘటనలో ప్రైవేట్ కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్ ఘాతానికి మృతి చెందడం తమ శాఖకు ఎంత మాత్రం సంబంధం లేదని కాంట్రాక్టర్ ముందుగా లైన్లలో పనులు చేస్తున్నపుడు పరిశీలన చేసుకోవాల్సిఉందని విద్యుత్ ఏడీఈ కిరణ్ పేర్కొన్నారు.

## మత్తులో వ్యక్తి దాడి : మహిళ మృతి


గంగమ్మ (ఫైల్)

కూనవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి మహిళపై దాడి చేయడంతో మృతిచెందిన సంఘటన అల్లూరి కూనవరం మండలం చింతగుండిలో జరిగింది. గ్రామానికి చెందిన చదల కన్నపురెడ్డి కల్లు కోసం ఆ గ్రామంలో గురువారం రాత్రి సమయంలో గొడవ చేశాడు. ఎవరు మందలించినా వాగ్వాదానికి దిగాడు. అదే గ్రామానికి చెందిన వాళ్ల గంగమ్మ (45)తో గొడవ పెట్టుకున్నాడు. ఆమెపై కర్రతో బలంగా కొట్టడంతో అక్కడే మృతిచెందింది. అడ్డు వచ్చిన గంగమ్మ భర్త చిన్న భీమ్ రెడ్డిపై దాడి చేయడంతో చేతికి గాయమైంది. ఈ సంఘటనపై మృతురాలి కుమారుడు మాధవరెడ్డి కూనవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ లతాశ్రీ కేసు నమోదు చేశారు. చింతూరు సీఐ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

# చెరువులా పాఠశాల... మరి చదువెలా!

ఏలేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోను చూశారా.. చెరువు కాదండోయ్.. పాఠశాల ఆవరణే.. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. దీంతో ఏలేశ్వరం బాలికోన్నత పాఠశాల ఆవరణలోకి నీరు చేరింది. దీంతో విద్యార్థులు ఆ నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాలకులు పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు డ్రైనేజీ ద్వారా బయటకు వెళ్లే ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చూపారు. దీంతో ఈ పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండటం పరిపాటిగా మారింది. పర్యావరణం, పరిశుభ్రత అంటూ సూచనలు ఇచ్చే ఉపాధ్యాయులే విద్యార్థులను ఈ మురుగు నీటిలో పాఠశాలకు ఎలా రమ్మనాలో అయోమయంలో ఉన్నారు.



## సామర్లకోట విద్యుత్ సిబ్బందిపై చర్యలు!

సామర్లకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విద్యుత్ సిబ్బంది ఇద్దరిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ నుంచి కాకినాడ జిల్లా విద్యుత్ ఉన్నతాధికారికి శుక్ర వారం సాయంత్రం ఆదేశాలు అందినట్టు విశ్వసనీయ సమాచారం. ఈనెల 17న ఆంధ్రజ్యోతిలో తల్లికి ఆనందమేది పేరిట కథనం ప్రచురితమైన విషయం విధితమే. సొంతిల్లు అయినా లేని తన పేరిట 40 విద్యుత్ సర్వీసులు ఉన్నట్టు నమోదులు కావడం వల్లే తన ఇద్దరు చిన్నారులకు తల్లికి వందనం పథకం రాలేదని మహిళ కటకం నాగ సత్య గంగాభవాని ఆవేదనపై ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. ఇప్పటికే ఈ వివాదానికి చెంది విద్యుత్ ఏఈ అమలాపురం కన్‌స్ట్రక్షన్ సెక్షన్‌కు బదిలీ అయిన విషయం విధితమే. కింది స్థాయి సిబ్బంది తప్పిదం కూడా ఉండడం వల్ల మహిళకు అన్యాయం జరిగినట్టు సీఎండీ కార్యాలయం అధికారులు భావించారు. దీంతో సామర్లకోట పట్టణ లైన్ ఇన్ స్పెక్టర్, లైన్‌మెన్‌పై సస్పెన్షన్ విధించాలని ఆదేశాలు కాకినాడ జిల్లా ఉన్నతాధికారికి అందినట్టు తెలిసింది.

## బీచ్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ మృతదేహం


కల్యాణి (ఫైల్)

సర్పవరం జంక్షన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యా రావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో శుక్రవారం ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. కాకినాడ రామారావు పేట చర్చి స్ట్రీట్ సుబ్బయ్య హోటల్ సమీపంలో నివసిస్తున్న కారం కల్యాణి (37)గా తిమ్మాపురం పోలీసులు గుర్తించారు. ఆమె కాకినాడ నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పని చేస్తోంది. భర్త పాము ఉదయ్ కుమార్ ప్రభుత్వ ఉద్యోగి. భర్త మృతి చెందడంతో కుమారుడికి కారుణ్య నియామకం కింద ప్రభుత్వం కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుడిలంకలో గ్రామ సర్వేయర్‌గా ఉద్యోగం ఇచ్చారు. భర్త మృతి చెందినప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి మానసిక సమస్య ఒత్తిడి, అనారోగ్య సమస్యతో బాధపడటంతో బీచ్‌కెళ్లి సముద్రంలో పడి మృతి చెంది ఉండవచ్చుని భావిస్తున్నారు. సూర్యారావుపేట వీఆర్వో సమాచారం మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిమ్మాపురం ఎస్‌ఐ వై గణేష్ కుమార్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు.

## అక్రమంగా ఆయిల్ దిగుమతి

**నలుగురి అరెస్టు**


స్వాధీనం చేసుకున్న ట్యాంకర్లతో పోలీసులు

అన్నవరం/శంఖవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆయిల్ దిగుమతి చేస్తున్న నలుగురు వ్యక్తులను అన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శివార్లలో దుర్గాడ సమీపంలో గురువారం ఆయిల్ దిగుమతి చేస్తుండగా లారీలపై దాడి చేసి అదుపులోకి తీసుకున్న విషయం విధితమే. ఈ దాడుల్లో పట్టుకున్న ట్యాంకర్లలో 9800 లీటర్ల ఆయిల్ ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. 2 ట్యాంకర్లు, ఆయిల్ తోడే మిషనుతో స్వాధీనం చేసుకుని నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే పోలీస్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ జిల్లా తుని ఎల్ఐసీ ఆఫీస్ ఎదురుగా మూతబడిన రైల్వే గేట్ వద్ద రైలు పట్టాలపై తుని వైపు నుంచి రాజమండ్రి వైపు వెళ్లే రైలు ఢీకొని 50 ఏళ్ల వ్యక్తి మరణించాడు. నలుపు తెలుపు నీలం అడ్డచారల్ ఆఫ్ చేతుల టీ షర్ట్, లుంగీ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని తుని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిస్తే 9490619020 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి


రామవరం పీహెచ్‌సీలో మహిళతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటేశ్వరరావు**

అనపర్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగే విధంగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని రామవరం పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, గర్భిణులకు అందించే సేవలు మెరుగు పడాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మీనాక్షి, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ వర్గపోరులో కార్మికులు నష్టపోయారు

**టీఎన్‌టీయూసీ నేత వర్రే**

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ నాయకుల వర్గపోరులో రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు తీవ్రంగా నష్టపోయారని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పేపరుమిల్లు గేటు ఎదురుగా ఉన్న టీఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో పేపరుమిల్లును నాశనం చేసి వెంటిలేటర్‌పైకి చేర్చిన వైసీపీ ఇప్పుడు దీక్షల పేరుతో ముందుకు రావడం శోచనీయమన్నారు. నక్కా చిట్టిబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రజాప్రతినిధులు పేపరుమిల్లు కార్మికులకు అన్యాయం చేశారని, సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఈనెల 21న కార్మికులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటుండగా వైసీపీ మాజీలు దీక్షలు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నా రు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్,నల్లం శ్రీను, మజ్జి రాంబాబు, దాస్యం ప్రసాద్, దుత్తరపు గంగాధర్, ఆడారి లక్ష్మీనారాయణ, బోసు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలను ప్రోత్సహించొద్దు

ధవళేశ్వరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక పంచాయతీ ఆవరణలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్యవివాహాల నిరోధక కమిటీ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు, కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ మహిళా పోలీసు, ఏఎన్ఎం, గ్రామసమాఖ్య సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. మిషన్ వాత్సల్య పథకం గురించి వివరించారు.

**దివాన్‌చెరువు:** బాల్యవివాహాల నిర్మూలన పర్యవేక్షణ కమిటీ సమావేశం దివాన్‌చెరువు గ్రామ సచివాలయం -1లో ఐసీడీఎస్ సెక్టారు సూపర్‌వైజర్ వి.మేరి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణా విభాగం కౌన్సిలర్ సీహెచ్ అభిషలేమ్ మాట్లాడుతూ కిశోర బాలికలకు బాల్యవివాహాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహక కలిగించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కావ్య, పీఏఆర్ఎఫ్ సంస్థ ప్రతినిధి ఎం.మహలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## శిథిల రహదారులను నిర్మించాలి: ఎమ్మెల్యే వాసు


డ్రైనేజీ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక 25వ డివిజన్‌లో శిథిలమైన రహదారులు నిర్మించాలని, డ్రైనేజీలను పునఃనిర్మించాలని, కల్వర్టులు నిర్మించాలని అధికారులను ఆదేశించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని 25వ డివిజన్‌లో పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీలను, రహదారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా విద్యుత్ లోవోల్టేజీ సమస్య వుందని, దానిని పరిష్కరించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించామన్నారు. నగరంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గోదావరి పుష్కరాలు నాటికి రాజమహేంద్రవరాన్ని సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, తవ్వా రాజా, నందు, ముద్రగడ జయరామ్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## 23న చాగల్నాడు కాలువ నీరు విడుదల

» మోటార్లకు రానున్న ఏడాదిలో మరమ్మతులు » ఇరిగేషన్ అధికారుల సమీక్షలో

**ఎమ్మెల్యే బత్తుల**


ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన చాగల్నాడు ఎత్తిపోతల పథకంలోని మోటార్లు, పైపులైన్లకు రానున్న ఏడాదిలో మరమ్మతులు చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలోని ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మెట్ట ప్రాంత రైతాంగానికి చాగల్నాడు ద్వారా సాగు, తాగు నీరందించి పంటలు పండించుకోవడానికి ఉపయోగపడే ఈ పథకం వైసీపీ ప్రభుత్వంలో పూర్తి నిర్లక్ష్యానికి గురైందన్నారు. దీంతో మోటార్లు, పైపులైన్లు పూర్తిగా పాడై సాగు నీటిని విడుదల కష్టంగా మారిందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 23న చాగల్నాడు కాలువ ద్వారా సాగు నీటిని విడుదల చేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. గత ఏడాది జూలై 29న నీటిని విడుదల చేశామని, ఈ ఏడాది గతం కంటే వారం రోజులు ముందుగానే విడుదల చేస్తున్నామన్నారు. కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. సమావేశంలో ఇరిగేషన్ అధికారులు ఏఈ సత్యనారాయణ, రిటైర్డ్ డీఎస్ఈ కడలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగులో జగ్గంపేట ముందంజ

**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**


తోటల విస్తరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ

గోకవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు చేసే నియోజకవర్గాల్లో జగ్గంపేట ముందంజలో ఉంటుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆయిల్ పామ్ తోటల విస్తరణ మహోత్సవంలో భాగంగా గోకవరంలో శుక్రవారం ఉద్యానశాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పామ్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగులో నియోజకవర్గ రైతులకు చాలా అనుభవం ఉందన్నారు. ఈ పంట రైతులకు వందేళ్లపాటు ఫలసాయం ఇస్తుందన్నారు. రాబోయే కాలంలో గోకవరం మండలంలో నీటి పారుదలకు సంబంధించి భూపతిపాలెం, ముసురుమిల్లి, సూరంపాలెం ప్రాజెక్టులను అనుసంధానం చేసి తద్వారా నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మల్లికార్జునరావు మాట్లాడుతూ దేశంలో ఆయిల్‌పామ్ సాగులో ఏపీ మొదటిస్థానంలో ఉందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలు కల్పిస్తున్నాయన్నారు. కోరుకొండ, గోకవరం, సీతానగరం మండలాల్లో 2025-26 సంవత్సరంలో 150 హెక్టార్లలో ఆయిల్ పామ్ మొక్కలు నాటినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పతంజలి సంస్థ ప్లాంటేషన్ విభాగాధిపతి వి.పట్టాభిరామిరెడ్డి, జగ్గంపేట ఏఎంసీ చైర్మన్ అడపా భరత్, గోకవరం సహకార సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, దాసరి తమ్మన్నదొర తదితరులు పాల్గొన్నారు.

## 25న పీడీఎస్‌యూ చలో విజయవాడ.. ధర్నా

**రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్**

**మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ**

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం రాజమహేంద్రవరంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నాలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకూ విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది గడిచినా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలేదని ఆరోపించారు. జీఓ 77 రద్దు చేయాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, సంక్షేమహాస్టళ్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాను, రాష్ట్ర కోశాధికారి రూప్ శంకర్, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## 30 ఏళ్లకు మోక్షం

» బిక్కవోలు వంగావారి వీధిలో సెంటర్ డ్రైనేజీ సీసీ రోడ్డు

» రూ.39 లక్షలతో నిర్మాణం


బిక్కవోలులో నిర్మించిన సెంటర్ డ్రైనేజీ సిమెంట్ రోడ్డు

బిక్కవోలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని వంగావారి వీధిలోని సీసీ రోడ్డుకు 30 ఏళ్లకు మోక్షం కలిగింది. ఈ రోడ్డును 1987లో సెంటర్ డ్రైనేజీతో గ్రామంలో మొదటి సీసీ రోడ్డుగా నిర్మించారు. అప్పటి నుంచి శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులతో సరిపెట్టేవారు. ఇప్పుడు ఏ ప్రభుత్వం వచ్చినా రోడ్డు అభివృద్ధికి శంకుస్థాపనలు చేసేవారు కాని పనులు జరిగేవి కావు. దీంతో కూటమి ప్రభుత్వం ఎటువంటి శంకుస్థాపనలు చేయకుండా ఉపాధి హామీ, పంచాయతీ, మండల పరిషత్ నిధులు రూ.39 లక్షలతో సెంటర్ డ్రైనేజీ, వాటర్ పైపులైన్లతో సీసీ రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు గ్రామంలోని ప్రాచీన ఆలయాలైన గోలింగేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలై లక్ష్మీగణపతి ఆలయం వద్ద ముగుస్తుంది. దీంతో భక్తులతో ఈరోడ్డు నిత్యం రద్దీగా వుంటోంది. రోడ్డు నిర్మాణం పట్ల భక్తులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. అలాగే గ్రామంలోని మెయిన్‌రోడ్ నుంచి ఎస్సీ కాలనీ వరకూ ఉపాధి నిధులు రూ.63.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు, లేఅవుట్-1లో జలజీవన్ మిషన్ నిధులు రూ.96 లక్షలతో నిర్మించే వాటర్‌ట్యాంకు, పైపు లైన్ల పనులకు ఐటీఎల భూమిపూజలు చేశారు.

## శాకంబరిగా కనకదుర్గమ్మ

» పలు ఆలయాల్లో ఆషాఢ మాసం సందర్భంగా పూజలు

» అమ్మవార్లకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో అలంకరణ


గోకవరంలో శాకంబరిగా కనకదుర్గమ్మ


శాంతిపురంలో శాకంబరిగా మహాలక్ష్మమ్మ

గోకవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గోకవరంలోని వీరభద్రుని గద్దెలో వేంచేసియున్న కనకదుర్గమ్మ శుక్రవారం శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా ఆర్యవైశ్య సంఘ మహిళలు రకరకాల కూరగాయలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. కాగా తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.

**ధవళేశ్వరంలో కన్యకాపరమేశ్వరి..**

ధవళేశ్వరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరి నది సమీపాన రామపాదాల ఘాట్ వద్ద శ్రీ వక్రమహిత వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని, ఉప ఆలయాలను, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల రకాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళా సమాజం ఆధ్వర్యంలో లలిత సహస్ర నామ పారాయణం అనంతరం ఊయల సేవ నిర్వహించారు. శనివారం అమ్మవారి అలంకరణ తీసివేసి కూరగాయలతో చేసిన కదంబ ప్రసాదాన్ని వితరణ చేయనున్నారు. కార్యక్రమంలో వాసవి మాత ట్రస్టు, యువ వైశ్య సంఘం పాల్గొన్నారు.

**శాంతిపురంలో మహాలక్ష్మమ్మ..**

అనపర్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అనపర్తి శాంతిపురంలో మహాలక్ష్మి అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ఆలయార్చకులు రామకృష్ణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.


వేమగిరిలో కొండాలమ్మ ఆలయం

**వేమగిరిలో కొండాలమ్మ..**

కడియం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వేమగిరి గ్రామదేవత కొండాలమ్మ ఆలయ నిర్వాహణ ధర్మకర్తలు, ఆర్ఎస్ ఆర్ ఫౌండేషన్ ట్రస్టీలు రంకిరెడ్డి సుబ్బరాజు- మహాలక్ష్మి, రంకిరెడ్డి గోపాలకృష్ణ-లావణ్య దంపతుల ఆధ్వర్యంలో కూరగాయలు, పండ్లతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారికి ఆషాఢం సందర్భంగా సారె, పిండి వంటలతో సారె, చీర సమర్పించారు. ఆలయాన్ని కూడా కూరగాయాలు, పండ్లతో అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**అన్నపూర్ణాదేవికి ఆషాఢం సారె**

దివాన్‌చెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని జ్యోతిర్లింగాలయంలో శ్రీ కాశీ అన్నపూర్ణాదేవికి ఆషాఢమాసం సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్తులతో శుక్రవారం ఆలయం కిటకిటలాడింది. శుక్రవారం అమ్మవారికి భక్తులు వివిధ రకాల తీపి పదార్థాలు, పండ్లను సారెగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి పూజలుచేసి హారతులిచ్చారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేశారు.


దివాన్‌చెరువులో అన్నపూర్ణాదేవికి సమర్పించిన ఆషాఢం సారె

## అన్ని రంగాల్లో భారత్ శరవేగంగా అభివృద్ధి

**ఎంపీ పురందేశ్వరి.. బీజేపీలో పలువురి చేరిక**

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ఆర్థిక, రక్షణ, పారిశ్రామిక, వ్యవసాయం, మౌలిక వసతుల కల్పన వంటి రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం మండలం పుణ్యక్షేత్రం, పెదపూడి మండలం జి.మామిడాడ, కొవ్వూరు ప్రాంతాల నుంచి పలువురు పార్టీలో చేరారు. వీరికి పురందేశ్వరి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో పొట్లూరి రామ్మోహన్, రొంగల గోపి, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ, పన్నాల లక్ష్మి, యానాపు ఏసు పాల్గొన్నారు.

**బీజేపీ-వారధి:** స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బీజేపీ - వారధి కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. వారధిలో అనేక సమస్యలు వచ్చాయని, వాటిలో వ్యక్తిగత, సామాజిక సమస్యలున్నాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను బీజేపీ కార్యాలయానికి వచ్చి తెలుపుకోవాలని నల్లమిల్లి కోరారు. తాను, ఎంపీ, ఎమ్మెల్సీ ఒక్కోరోజు అందుబాటులో ఉంటామని, ఎవరు ఏ రోజున ఉంటారో ముందుగానే తెలియజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హారిక, మద్దిపాటి రజని, వీర వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కోటిలో తొలి అడుగు

కోరుకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శుక్రవారం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లస్టర్ ఇన్‌చార్జి అడపా వీరబాబు పర్యవేక్షణలో రెండు బూత్‌లలో 890 గృహాలకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఈ సంవత్సరంలో సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో అడపా శివనాగేశ్వరరావు, రావిపాటి వెంకట్రావు, డీకెల్లి అభిలాష్, చదువు సత్తిబాబు, అడపా సత్యనారాయణ, రావిపాటి రమేష్, ఉల్లి మహేశ్వరరావు పాల్గొన్నారు.

**రంగంపేట/బిక్కవోలు:** రంగంపేట మండలం పాతవీరంపాలెం, బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఈ ఏడాది కాలంలో పాతవీరంపాలెం రూ.1,62,83,000తోను, ఊలపల్లిలో రూ.11.65 కోట్లతోను చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఊలపల్లిలో మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని గ్రామస్తులు తెలపడంతో వెంటనే సరి చేయాలని పంచాయతీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, ఉద్దంద్రావు శ్రీను, సర్పంచ్ బండారు రమ్య, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, తొండాపు సురేష్‌కుమార్ రెడ్డి, పడాల చినబుజ్జి, గేదెల సత్తిబాబు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ సీఐ శివగణేశ్ పేర్కొన్నారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలపై సీఐ శివణేశ్, జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది వైవీ సురేశ్, పి.దుర్గాప్రసాద్ గర్ల్స్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనవసరమైన లింకులను క్లిక్ చేయొద్దని, బ్యాంకు ఎకౌంట్ వివరాలను అపరిచితులతో పంచుకోద్దని చెప్పారు. పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, ఈకేవైసీలను అప్‌డేట్ చేసుకోవాలని వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.

## 'కనీస సౌకర్యాలు కల్పించండి'

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18( ఆంధ్రజ్యోతి): రాజానగరం జాతీయ రహదారిని ఆనుకుని వున్న బ్రిడ్జి కౌంటీ టౌన్ షిప్‌లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాలనీ వాసులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ మేరకు వారు రాజమహేంద్రవరంలో ఓ ప్రకటన విడుదల చేశారు. పైసా పైసా కూడబెట్టి ప్లాట్‌లు కొనుగోలు చేశాక అక్కడ సరైన వసతులు లేకపోతే ఎంత బాధో అర్థం చేసుకోవాలన్నారు. అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పి ఇంతవరకు ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## కార్మికులకు న్యాయం జరగాలి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులకు న్యాయం జరగాలనే కోరుకుంటున్నామని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక కృష్ణసాయి కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపరుమిల్లు కార్మికులకు వారి డిమాండ్ మేరకు వేతన ఒప్పందం జరగాలని తాము కోరుకుంటున్నామే తప్ప ఇందులో వ్యక్తిగత అజెండా గాని ప్రయోజనం గాని లేదన్నారు. కార్మికులు నష్టపోతున్నారు వారికి న్యాయం చేయాలనే తాము కోరుతున్నామన్నారు. ఇందులో యాజమాన్యం ఇగో సంతృప్తి కోసం అవసరమైతే తాను దిగి వారి బూట్లు కూడా తుడుస్తానన్నారు.

## ఎల్ఐసీతో ప్రతిఒక్కరికి భరోసా

కడియం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరికి బీమా ద్వారా భరోసా కల్పించే సంస్థ భారతీయ జీవిత బీమా సంస్థ ఒకటేనని సంస్థ రూరల్ బ్రాంచి మేనేజర్ రఘుకుమార్ తెలిపారు. పల్ల సత్తిబాబు నర్సరీలో ఏజెంట్లకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నపిల్లలు విద్యకు, అమృత్ బాల్, వృద్ధాప్యంలో గ్యారంటీ బోనస్‌తో ప్రయోజనం పొందే న్యూనవజీవన్‌శ్రీ, జీవన్‌లాభ్, ఒకేసారి పొదుపు చేసి జీవితాంతం పెన్షన్ సదుపాయం పొందే జీవన్ శాంతి వంటి అనేక పాలసీలను ఎల్ఐసీ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.

## రాజానగరం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా వెంకటరమణమ్మ



కోరుకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాజానగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా శ్రీరంగపట్నం గ్రామానికి చెందిన తనకాల వెంకటరమణమ్మను నియమిస్తూ గురువారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. వెంకటరమణమ్మ భర్త నాగేశ్వరరావు టీడీపీలో పార్టీ ఆవిర్భావం నుంచి కొనసాగుతున్నారు. ఆయన ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయన సతీమణి వెంకటరమణమ్మను ఏఎంసీ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రాజానగరం-చక్రద్వారబంధం ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణ

రాజానగరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వయా చక్రద్వారబంధం మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సును ఎమ్మెల్సీ సోము వీర్రాజు శుక్రవారం చక్రద్వారబంధంలో జెండా ఊపి ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థుల కోరిక మేరకు సంబంధిత అధికారులను సంప్రదించి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించినట్టు చెప్పారు. గతంలో ముకుందవరం నుంచి రాజమహేంద్రవరం వయా చక్రద్వారబంధం మీదుగా ఆర్టీసీ బస్సు నడిచేదని, అనివార్య కారణాలతో నిలిచిపోయిందన్నారు. కార్యక్రమంలో నీరుకొండ వీరన్నచౌదరి, అడబాల గణపతిరావు, సోడసాని త్రిమూర్తులు పాల్గొన్నారు.

## నర్సరీని సందర్శించిన డోన్ ఎమ్మెల్యే

కడియం, జూలై 18(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏరాసు ప్రతాపరెడ్డి శుక్రవారం కడియంలోని మార్ని నారాయణరావు-సాయిరాఘవేంద్ర నర్సరీని సందర్శించారు. వారికి నారాయణరావు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా నర్సరీలో ఇండోర్, ఔట్‌డోర్ ఫల,పుష్ప, ఆర్నమెంటల్ మొక్కలను ఆయన తిలకించారు. నారాయణరావుకు తమకు ఎప్పటి నుంచో అనుబంధం ఉందని సూర్యప్రకాశరెడ్డి అన్నారు. అనంతరం ఆయన ఇంటికెళ్లి ఆతిథ్యాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మార్ని జానకీరామ్(నాని), అల్లూరి సతీష్, మార్ని విష్ణు పాల్గొన్నారు.

## పాఠశాలలను పరిరక్షించుకోవాలి

బిక్కవోలు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంతో పాటు పాఠశాలలను పరిరక్షించుకోవల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ ప్రసాదరావు సూచించారు. మండలంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టింది. ఈ సందర్భంగా మెళ్లూరు, పందలపాక, ఇళ్లపల్లి గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సభ్యత్వాన్ని అందజేసారు. అనంతరం ఇళ్లపల్లిలో ప్రసాదరావు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పెండింగ్‌లో వుంచిన డీఏ బకాయిలపైనా, పీఆర్‌సీ పైన జేఏసీతో కలసి పోరాటం చేస్తామన్నారు.





## జలవనరుల శాఖ ఈఈ సస్పెన్షన్

### నిడదవోలు ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావుపై వేటు



పాలకొల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం కార ణంగా గోదావరి వెస్ట్రన్ డివిజన్ (నిడదవోలు) కార్యని ర్వాహక ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యేశ్వర రావును సస్పెండ్ చేస్తూ జలవన రుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానా యుడు ఆదేశాలు జారీ చేశారు.ఈ మే రకు కార్యాలయం నుంచి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓఅండ్ఎం నిధులు విడుదల చేసినప్పటికీ తగిన సమ యంలో పనులు చేపట్టకపోవడం వల్ల గోదావరి వెస్ట్రన్ ప్రధాన కాలువ పరిధిలోని బ్యాంక్ కెనాల్ నిడదవోలు - నరసాపురా నికి సంబంధించిన నియోజకవర్గాల్లో సాగునీటి కొరత ఏర్ప డింది. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించి ఈఈ సుబ్ర హ్మణ్యేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. సాగునీటి నిర్వహణలో అధికారులు ఎటువంటి అలసత్వం వహించిన చర్యలు తప్పవన్నారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగానే ఈఈని సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు.










### దంచికొట్టిన వాన

వరుణుడు దంచికొట్టాడు.. చూస్తుండగానే ముంచేశాడు.. శుక్రవారం రాత్రి 9 గంటలకు ఎవరి పనిలో వాళ్లున్నారు.. ఆకాశం ఉరుముతున్నా పట్టించుకోలేదు..అంతే వరుణుడు ఒక్కసారిగా వచ్చాడు.. ఇలా ముంచాడు.. రాజమహేంద్రవరంలో శ్యామలా సెంటర్‌లో అరగంట సేపు ఆగకుండా కురిసిన వానతో పరిసరాలు ఇలా జలమయంగా మారాయి. ఆ తరువాత నగరమంతా వాన కురిసింది.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



### చినుకులా రాలి.. వరదలై పోయి..

చినుకులా రాలి.. వరదలై పోయి.. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం పుష్కరఘాట్ వద్ద అచ్చంగా ఇదే కనిపించింది. ఒక్కసారిగా పడిన వానతో చినుకు చినుకు ఏకమై ఇలా వరదలా మారింది.. ఉవ్వెత్తున ఎగసిపడుతూ గోదారమ్మ ఒడిలో కలిసిపోయింది.. సుమారు అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా వాననీరు వరదలా రోడ్లపై ముంచెత్తింది.

# ప్రిపరేషన్!

## రైస్ కార్డులకు.. రైట్ రైట్



(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు భారీగా వెల్లువెత్తాయి. గత వైసీపీ హయాంలో కొత్త కార్డుల జారీ లేక పోవడంతో వేలాది మంది పేదలు ఈసురోమ న్నారు. రకరకాల కారణాలతో ఉన్న కార్డులను సైతం భారీగా అప్పట్లో ఏరేశారు. దీంతో ప్రభు త్వం మారాక కార్డుల జారీకి నిర్ణయించడంతో ఇప్పటి వరకు 1.53 లక్షల మంది అర్జీలు అం దించారు. ఇందులో ఏకంగా 1.10 లక్షల మంది తమకు ఉన్న కార్డుల్లో అదనపు సభ్యులను చేర్చాలంటూ దరఖాస్తులు ఇచ్చారు. ప్రస్తుతం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి దాదాపుగా ప చ్చజెండా ఊపారు. త్వరలోనే లబ్ధిదారులకు ప్ర భుత్వం కొత్తకార్డులను మంజూరు చేయనుంది.

### నాడు ఉన్ననీ పీకేశారు..

గత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాల అ మలు పేరుతో ఎడాపెడా లబ్ధిదారులను కోసే శారు. రకరకాల నిబంధనల పేరుతో రేషన్‌కా ర్డులను భారీగా ఏరేశారు. ఉమ్మడి జిల్లాలో అప్పట్లో 16.50 లక్షల రేషన్‌కార్డులుండగా అం దులో తెల్లకార్డులు 15.69 లక్షలు ఉండేవి. వీటి లో అనర్హులు అధికంగా ఉన్నారని భావించిన అప్పటి ప్రభుత్వం అమరావతి నుంచి 28,500 మంది కార్డుదారుల పేరుతో జాబితాను జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపి గుట్టుగా క్షేత్ర స్థాయి తనిఖీలు చేసి అందరి కార్డులు రద్దు చేయాలని ఆదేశించింది. 17,500 మంది కార్డు దారులు సొంత గ్రామాల్లో నివసించడం లేదనే కారణంతో వాటిని రద్దుచేసేశారు. దీంతో ప్రతి పక్ష హోదాలో నాడు టీడీపీ ఆందోళన బాట పట్టింది. కార్డులను అడ్డగోలుగా ఏరివేయడంపై నిరసనలు చేపట్టింది.అయితే ప్రభుత్వం మారిన తర్వాత సీఎం చంద్రబాబు కార్డుదారుల కష్టా లను పరిష్కరించాలని అధికారులను ఆదేశిం చారు.రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేప ట్టడానికి పచ్చజెండా ఊపారు. దీంతో గత మే 14 నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సచివాల యాల పరిధిలో రేషన్‌కార్డులకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొత్తగా వివాహమైనవారు, ఇప్పటివరకు రేషన్ కార్డు లేనివారు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదైనవారు ఇలా ఏడు రకాల సేవలకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది.

### 1,53,341 అర్జీలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం ఇప్పటివరకు 1,53,341 మంది నుంచి అర్జీలు వచ్చాయి. కొత్తకార్డులు కావాలంటూ 14,197 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఉన్న కార్డు ల్లో కొత్తగా సభ్యులను చేర్చాలంటూ 1,10,587 మంది విజ్ఞప్తులు చేశారు. వచ్చిన అర్జీల్లో అత్య ధికంగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చాలంటూ కోరినవే ఉన్నాయి. ఇప్పటివరకు వచ్చిన మొత్తం అర్జీల్లో 90 శాతానికిపైగా అధి కారులు క్షుణ్ణంగా పరిశీలించారు. దాదాపు అన్ని అర్జీలను అధికారు లు పరిగణనలోకి తీసుకుని ప్ర భుత్వానికి జాబితా కూడా పంపా రు. త్వరలో కొత్త కార్డుల జారీ చేయడానికి వీలుగా ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. దీంతో త్వరలోనే కార్డులు అందుతాయి.

- రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడిగా 1,53,341 వినతులు
- వైసీపీలో కార్డుల్లో కోత
- కూటమి ప్రభుత్వంలో అవకాశం
- భారీగా వెల్లువెత్తిన విజ్ఞప్తులు
- చేర్పులకు 1,10,587 దరఖాస్తులు
- అధికారుల గ్రీన్‌సిగ్నల్
- ఏటీఏం కార్డులా రైస్ కార్డులు

### ఏ జిల్లాకు ఎన్ని..

- కాకినాడ జిల్లా నుంచి 62,988 మంది ఉ న్నారు. ఉన్న కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యులను చేర్చాలని 46,729 మంది, రేషన్‌కార్డు విభజించాలని 6,091, కొత్త కార్డులకు 5,170, చిరునామా మార్పునకు 1,986 మంది అర్జీలు అందించారు.
- కోనసీమలో మొత్తం 45,080 దరఖాస్తులు రాగా చిరునామా మార్పునకు 1,751, కొత్త సభ్యులను చేర్చాలంటూ 32,254 పేర్లు రద్దుకు 1,275 కొత్తకార్డులకు 4,268, కార్డు విభజించాలని 4,536 అర్జీలు వచ్చాయి.
- తూర్పుగోదావరి జిల్లా నుంచి 45,273 అర్జీలు వచ్చాయి. తమ కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలంటూ 31,604 మంది మొర పెట్టుకున్నారు. కార్డులు విభజించాలంటూ 4,664 మంది, కొత్త కార్డులు కావాలని 4,759 మంది అర్జీలు అందించారు.

### ఇక డిజిటల్ కార్డులు

చంద్రబాబు అంటేనే ఐటీ ముఖ్యమంత్రి అంటారు.. ప్రస్తుతం రేషన్ కార్డుల్లోనూ ఆ మార్పు చూపిస్తున్నారు. త్వరలో ఇవ్వనున్న కొత్త రేషన్‌కార్డులను రైస్ కార్డుల పేరిట ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ఇవి పూర్తిగా ఏటీఏం కార్డు తరహాలో కొత్తగా డిజైన్ చేశారు. వీటికి క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. రేషన్ దుకాణంలో సరుకులు తీసుకున్న తర్వాత డీలర్ సేవలపై క్యూఆర్ కోడ్ ద్వారా ప్రభుత్వానికి కార్డుదారులు తమ అభిప్రాయాలు కూడా తెలపవచ్చు.





## దండాలు.. దండాలు వేగులమ్మ తల్లి

గోకవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి గ్రా మంలో మాతృశ్రీ వేగులమ్మ తల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభించా రు..గ్రామంలోని మహిళలంతా బోనాల తో ఊరేగారు.శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించా రు. చల్లంగ చూడమని వేడుకున్నారు.

## డీలర్ల కమీషన్ పెంచండి

### రాష్ట్ర అధ్యక్షుడు రామారావు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల కమీషన్ ను పెంచి న్యాయం చేయాలనిఏపి రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూనపరెడ్డి ఎస్వీ రామారావు విజ్ఞప్తి చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్ర వారం విలేకరులతో మాట్లాడారు. డోర్ డెలివరీ చేసే రేషన్‌కు కిలో బియ్యానికి రూ.3 వరకు కమీషన్ పెంచాలని కోరా మన్నారు. కమిషన్ పెంపుదల విషయ మై సీఎం చంద్రబాబు, సివిల్ సప్లయి స్ కమిషనర్‌ను కలిసి కేజీ బియ్యానికి రూ.1 నుంచి రూ.3లోపు పెంచాలని వినతిపత్రం అందించామన్నారు. వారు స్పందించి రూపాయి 60 పైసల నుంచి రూ.2ల వరకు పెంచే అకాశం ఉంద న్నారు. రేషన్ డీలర్ల శ్రమను గుర్తించి అదనపు పని దినాలకు అదనపు ఆదాయాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశా రు. సమావేశంలో సంఘం జనరల్ సెక్రటరీ మునుగా గిరిజారావు, జిల్లా అధ్యక్షుడు బీవీఎస్.సాయిరెడ్డి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు నల్లా వెంకటేశ్వరరావు, రాజమహేంద్రవరం అర్బన్ అధ్యక్షుడు నమ్మి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చిన ధవళేశ్వరం వాసవీ కన్యకా పరమేశ్వరి

# ఆనంద హారితం!




(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం మరో హామీ నెరవే ర్చింది.. గ్రీన్ ట్యాక్స్ తగ్గించి వాహనదారులకు పెద్ద ఊరటనిచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కసారిగా పెంచిన హరిత పన్ను వాహనదా రుల తలకు మించిన భారమైంది. రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వందల్లో ఉండే గ్రీన్‌ట్యాక్స్‌ను వేలల్లో పెంచిం ది.. పర్యావరణం పేరుతో పది టన్నుల లారీ లపై రూ.ఐదు వేలు, 30 టన్నుల లారీలపై రూ.15 వేలు విధించడంతో లారీ యజమాను లు గగ్గోలు పెట్టారు. ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఈ ట్యాక్స్ తగ్గి స్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కూట మి ప్రభుత్వం వచ్చాక హరిత పన్ను విష యమై లారీ యజమానుల వినతిని సర్కారు పరిశీలించింది. (గ్రీన్ ట్యాక్స్) హరితపన్ను భా రాన్నితగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- నెరవేరిన మరో హామీ
- గ్రీన్‌ట్యాక్స్ తగ్గింపు
- వైసీపీలో రూ.20 వేలు
- ప్రస్తుతం రెండు స్లాబ్‌లు
- రూ.1500, రూ.3 వేలు
- సర్కారు ఉత్తర్వులు జారీ

### వైసీపీలో పిండుడే..

గత ప్రభుత్వంలో వివిధ వాహనాలకు ఏటా గరిష్ఠంగా రూ.20 వేల వరకు గ్రీన్ ట్యాక్స్ విధించగా కూటమి ప్రభుత్వం దీనిని సవరించి ఏడాదికి రూ.1500, రూ.3000 చొప్పున రెండు శ్లాబుల్లో వసూలు చేసేలా కొత్త విధానం తెచ్చింది. సరకు రవాణా (లా రీలు, వ్యాన్లు), ప్రజా రవాణా (బస్సులు, మినీ బస్సులు) ఏడేళ్ల తర్వాత ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలంటే ఏటా హరిత పన్ను చెల్లించాలి. గతంలో ఈ పన్ను కేవలం రూ.200 మాత్రమే ఉండేది. కాలం చెల్లిన వాహనాలను తగ్గించా లని దీనిని పెంచుకునేలా కేంద్రం వెసులు బాటు కల్పించింది. దీనిని ఆసరాగా తీసుకున్న జగన్ ప్రభుత్వం 2022 జనవరి నుంచి రాష్ట్రంలో హరిత పన్నును భారీగా పెంచింది. ఏడు నుంచి పదేళ్ల వాహనాలకు సగం త్రైమా సిక పన్ను విలువ, పదేళ్ల నుంచి 12 ఏళ్ల నాటికి ఒక త్రైమాసిక పన్ను విలువ, 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసిక పన్నుల విలువ మేర చెల్లించేలా ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆయా వాహనాల కేటగిరీ, వాటి వయసు బట్టి కనిష్ఠంగా రూ.800 మొదలుకొని గరి ష్ఠంగా రూ.20 వేల వరకు ఏటా చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. లారీలు, టిప్పర్ల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసింది. పాసిం జర్ వాహనాలు, స్కూలు, కాలేజీ బస్సులు, మ్యాక్సీ క్యాబ్స్ ఓమ్నీ బస్సులు వంటి వాటికి రూ.ఆరు వేలు, చివరికి ఆటోలు, బైక్‌లు, క్రేన్ లు, ట్రాక్టర్లపైనా భారీగా పన్ను పెంచారు. పన్ను భారం భరించలేక వీరంతా ఆందోళన లు చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించు కోలేదు. ఉమ్మడి జిల్లాలో 55 వేల వరకు లారీ లు ఉండగా, వీటిపై కోట్లలో పన్ను భారం పడింది. కాకినాడ జిల్లాలో 2.94 లక్షలు, తూ ర్పుగోదావరి జిల్లాలో 2.10 లక్షలు, కోనసీమ జిల్లాలో 1.80 లక్షల వాహనదారుల నుంచి జగన్ ప్రభుత్వం హరిత పన్ను పిండేసింది.

### జిల్లాల్లో తగ్గనున్న భారం

ప్రస్తుతం హరిత పన్నుపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ.24.10 కోట్ల వరకు ఉమ్మడి జిల్లా వాహనాలపై పన్నుభారం తగ్గ నుంది. అత్యధికంగా కాకినాడ జిల్లాలో 2.94 లక్షల వాహనాలపై రూ.9 కోట్లు, తూర్పుగోదా వరిజిల్లాలో 2.10 లక్షల వాహనాలపై రూ.8.10 కోట్లు, కోనసీమలో 1.80 లక్షల వాహనాలపై రూ.ఏడు కోట్ల పన్ను భారం తగ్గనుంది.

# నాడు రివర్స్.. నేడు టెండర్స్!



పోలవరం ఎడమ కాలువ

## సాగుతున్న పోలవరం ఎడమ కాలువ పనులు

**పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) పనులు సాగుతున్నాయి. 2008లో ప్రారంభ మైన కాలువ పనులు 17 ఏళ్లయినా నేటికీ సాగుతూనే ఉన్నా యి. భూసేకరణ తదితర సమస్యలు వెన్నాడుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించు కోకపోవడంతో ఐదేళ్లూ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మళ్లీ పనులకు టెండర్లు పిలిచి దారిలో పెట్టింది.**

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి నీటిని విశాఖ ఇండస్ట్రియల్, సాగు తాగునీటి అవసరాలు తీర్చాలనే లక్ష్యంతో పోల వరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసి) నిర్మిస్తున్నారు.పోలవరం ప్రాజెక్టు ఆలస్యం కావడంతో 2014లో తెలుగుదేశం ప్రభుత్వం సీతానగరం మండలంలో పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. అది నేటికీ ఆరంభమే కాలేదు. 2019లో అధికా రంలోకి వచ్చిన వైసీపీ పురుషోత్తపట్నం ఎత్తి పోతల పథకాన్ని కోర్టులో వివాదాస్పదం చేయ డంతో పాటు, ఎడమ ప్రధాన కాలువ పనులు వదిలేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం కూటమి ప్రభుత్వం దీనిపై మళ్లీ దృష్టి పెట్టింది. 8 ప్యాకేజీలుగా పనులు విభ జించి టెండర్లు పిలిచి పనుల మొదలు పెట్టిం ది. వాస్తవానికి జూన్ నెలాఖరుకు కాలువ పనులు పూర్తి చేసి పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా పోలవరం ఎల్ ఎంసీలోకి నీటిని పంపి ఏలేరు, విశాఖ అవస రాలకు నీరందివ్వాలనేది ప్రభుత్వ ఆలోచన. కానీ ప్రస్తుతం భూసేకరణ, ఇతర సమస్యల వ ల్ల ఆలస్యమయ్యే పరిస్థితులున్నాయి.

### 4 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం..

పోలవరం ప్రాజెక్టు దగ్గర నుంచి విశాఖ పట్నం వరకూ 214.808 కిలోమీటర్ల పొడవున ఈ ఎల్ఎంసీని నిర్మిస్తున్నారు. 4 లక్షల ఎకరాల ఆయకట్టు లక్ష్యం. తూర్పుగోదావరి జిల్లా రాజా నగరం నియోజకవర్గం పరిధిలో 1.15 లక్షల ఎకరాలు. కాకినాడ జిల్లా పరిధిలో 1.21 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందివ్వాలి. కాకినాడ నియోజకవర్గంలో 0.42 లక్షలు, జగ్గంపేట నియోజకవర్గంలో 0.0998 లక్షలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 0.450 లక్షలు, తుని పరిధిలో 0.240 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడం లక్ష్యం. అనకాపల్లి జిల్లా పరిధిలో 1.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వాలి. ఈ పోలవరం ఎడమ ప్రధాన కాలువ సామర్థ్యం 17,561 క్యూసెక్కులు.అంటే సెకనుకు ఈ కాలువ నుం చి 17,561 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. కాలువకు పోలవరం ప్రాజెక్టు నుంచి 108.248 టీఎంసీల నీటిని కేటాయిస్తారు. అందులో ఇరిగేషన్‌కు 84.808 టీఎంసీలు, మంచినీరు, పరిశ్రమల అవసరాలకు 23.44 టీఎంసీల నీటి కేటాయింపు అవసరమని అంచనా వేశారు.

### రివైజ్డ్ అంచనాలతో పనులు..

వాస్తవానికి పోలవరం ఎడమ ప్రధాన కాలువ (ఎల్ఎంసీ) నిర్మాణానికి రూ.1954.74 కోట్లతో జీవో 104ను 2008 మే 30న జారీ చేశా రు.ఆ తరువాత 2016 డిసెంబర్ 6న అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.3645.24 కోట్ల రి వైజ్డ్ అంచనాతో జీవో నంబర్ 117 జారీ చేసిం ది. 2019 ఫిబ్రవరి 10న కాలువ పనులు, భూ సేకరణ మొత్తం అంచనాలు వేసి రూ.6205.24 కోట్ల రివైజ్డ్ అంచనాతో జీవో 21 జారీ చేసింది. భూసేకరణకు రూ.2002.55 కోట్లు, పనులకు రూ.4202.69 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకూ రూ.2987.44 కోట్ల పనులు పూర్తయ్యా యి. 2024 సెప్టెంబర్ 3న జీవో 319 జారీ చేస్తూ పనులను 8 ప్యాకేజీలుగా విభజించా రు.ఈ కాలువలో ఎర్త్ వర్క్ 12 లక్షల 79 వేల 600 క్యూబిక్ మీటర్లు చేయాల్సి ఉంది. లైనింగ్ 214.808 కి.మీ 133.446 కి.మీ మేర జరిగింది. స్ట్రక్చర్ల నిర్మాణ పనులు 385 జరగాల్సి ఉండగా 99 పనులు చేపట్టాల్సి ఉన్నాయి. 8 స్ట్రక్చర్లను తొలగించడానికి ప్రతిపాదించారు. భూసేకరణ 10,500 ఎకరాలకు 10,306 ఎకరాలు సేకరిం చారు.ప్యాకేజీ 5 పరిధిలో 11.37 ఎకరాలు, ప్యా కేజి 7 పరిధిలో 9.485 ఎకరాలు సేకరించాల్సి ఉంది.భూసేకరణకు ఇప్పటి వరకూ రూ.530. 04 కోట్లు ఖర్చు చేశారు.పాత ఏజెన్సీలను రద్దు చేసి కొత్త ఏజెన్సీలకు పనులిచ్చారు.8 ప్యాకే జీ ల్లో చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

- గత 17 ఏళ్లుగా సాగదీత
- నేటికీ పూర్తికాని పనులు
- వైసీపీలో తీవ్ర నిర్లక్ష్యం
- పైసా కూడా విదల్చని వైనం
- దృష్టి పెట్టిన కూటమి సర్కారు
- 8 ప్యాకేజీలుగా విభజన



కొండగుంటూరులో పట్టుకున్న లారీలు

## అక్రమ మట్టి తరలింపు

### టిప్పర్లను అడ్డుకున్న జనసైనికులు

రాజానగరం,జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలను రాజానగరంలో గురువారం అర్ధరాత్రి జనసైనికులు అడ్డుకుంటే.. ఆ తరువాత అధికారులు వదిలేశారు. కలవచర్ల లోని పోలవరం కాలువగట్టు గత కొంతకా లం గా కొల్లగొడుతున్నారు. దీంతో జన సైని కులు గురువారం రాత్రి సుమారు 12 లారీలను అడ్డుకుని అధికారులకు సమా చారం ఇచ్చారు. పట్టుకున్న లారీలను తహశీల్దార్ కార్యాలయంలోకి తరలించా రు. దీనిపై తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతిదేవి మాట్లాడారు. సూర్యారావు పేట సమీపంలో మాల్ నిర్మాణంలో భాగంగా వచ్చిన మట్టిని మరొక ప్రాం తంలోని సొంత స్థలంలోకి తరలిస్తున్న 4 లారీలు ఉన్నాయన్నారు. పోలవరం కాలు వ నుంచి మట్టిని తరలిస్తున్న మరో 6 లారీలకు అనుమతులు ఉండడంతో విడి చిపెట్టామన్నారు.మరో రెండు లారీలకు ఛలానాలు కట్టించుకుని విడిచిపెట్టడం జరిగిందని తహశీల్దార్ బదులిచ్చారు.

### 3 టిప్పర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

దివాన్‌చెరువు, జూలై18 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండలం కొండగుం టూరులోని ప్రభుత్వభూమి సర్వే నెంబ రు 642లో జరుగుతున్న అక్రమ గ్రావెల్ త్రవ్వకాలపై మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్ రెడ్డి, రెవెన్యూ అధికారులు శుక్రవారం ఆ కస్మికంగా తనిఖీలు చేశారు. ఎక్స్‌కవేట ర్, గ్రావెల్ లోడ్ కలిగిన 3 టిప్పర్లను అ ధికారులు సీజ్ చేశారు. వాహనాలను కొండగుంటూరు ఆర్ఐకి స్వాధీనపరచా మని అధికారులు తెలిపారు.తనిఖీలో మైనింగ్‌శాఖ అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. విఘ్నేశ్వరుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి. జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

నల్లజర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): డైట్ సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం నుంచి ఈనెల 22 వరకు జరుగుతుందని దూబచర్లలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్‌కళాశాల) ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి శుక్రవారం తెలిపారు. డైట్ కళాశాలకు (దూబచర్ల) 99 మంది, డాక్టర్ సీఎస్ఎం కాలేజీ ఆఫ్ భీమవరం 71 మందికి ప్రవేశాలు కల్పిస్తున్నట్టు డైట్‌సెట్ కన్వీనర్ ఉత్తర్వులు జారీ చేశారని ప్రిన్సిపాల్ చెప్పారు.

## నిడదవోలు పట్టణాభివృద్ధికి కృషి : మంత్రి

నిడదవోలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిడద వోలు పట్టణాభివృద్ధికి నిధులు సమీకరిస్తూ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 9,10 వార్డుల్లో 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి రూ. 99.50 లక్షలు, రుడా నిధుల నుంచి 47.90 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులకు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిడదవోలులో 100 పడకల ఆసుపత్రి, ఇండోర్ స్టేడియం ఏర్పాటు, మాలకోడు చెరువు చుట్టు అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు పట్టణంలో సుందరీకరణ పనులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. త్వరలోనే రూ. కోటి నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అలాగే పురపాలక శాఖ నుంచి రూ. కోటి మంజూరు చేశారని, అవి సరిపోవని మరో రూ. రెండుకోట్లు కోరానని అన్నారు. ముఖ్యంగా నియోజకవర్గ ప్రజలు సమస్య ఎదురైతే వాట్సాప్ ద్వారా తన దృష్టికి తీసుకువస్తున్నారని, ఆ సమస్య పరిష్కారానికి తాను స్వయంగా కృషి చేస్తున్నానన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిడదవోలు నియోజకవర్గాన్ని


నిడదవోలులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్, రుడా చైర్మన్ వెంకటరమణ చౌదరి

గాలికి వదిలేశారన్నారు. నిడదవోలు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం మెప్మా ఉద్యోగులు గత నాలుగు నెలలుగా జీతాలు అందలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, తక్షణం సంబంధిత అధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో జీతాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే నిడదవోలు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వేరే చోటుకు తరలిపోతుందనే అపోహకు చెక్ పెడుతూ నిడదవోలులోనే ఉంచాలని ఆర్డీవోను ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ చిన రాముడు, ఆర్డీవో రాణీసుస్మిత, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**● కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు**

తిమ్మరాజుపాలెంలో వేంచేసి వున్న కోట సత్తెమ్మను శుక్రవారం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆచార ప్రకారం పండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

**●నేడు అమ్మవారి దర్శనం వేళల్లో మార్పు**

కోటసత్తెమ్మ వారి ఆలయ దర్శనాన్ని శనివారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే కల్పించబడుతుందని, తిరిగి ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇవ్వనున్నారని దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

### ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే


గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల నుంచి గ్రీవెన్స్‌లో స్వీకరించిన ఫిర్యాదులను ఆయాశాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, సూరపనేని చిన్ని, అన్నాజీ రామాంజనేయులు, కొప్పాక జవహర్, పెనుమాక జయరాజు, వేమగిరి వెంకట్రావు, మద్దిపాటి సత్యనారాయణ, తోరం నగేష్, యనమదల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

### 21న పోస్టాఫీసుల్లో లావాదేవీలు నిలిపివేత

కొవ్వూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించటంలో భాగంగా ఈనెల 22వ తేదీన తాడేపల్లిగూడెం పోస్టల్ డివిజన్ పరిధిలో అన్ని పోస్టాఫీసుల్లో అడ్వాన్స్‌డ్ పోస్టల్ టెక్నాలజీని (ఏపీటీ) అమలు చేస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ కే.కృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను విజయవంతంగా అమలుచేయడంలో భాగంగా ఆరోజు అన్నిరకాల లావాదేవీలు, సేవలు తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నామన్నారు.

### అమ్మవారికి సారె సమర్పణ


ఆలయంలో లలితాపారాయణం చేస్తున్న మహిళా భక్తులు

దేవరపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మూడుబొమ్మల సెంటర్ వద్ద ఉన్న సౌభాగ్య దుర్గాంబిక ఆలయంలో మహిళా భక్తులు శుక్రవారం ఆషాడం సందర్భంగా అమ్మవారికి సారె, చీర, పలురకాల స్వీట్లు, పండ్లు సమర్పించారు. అలాగే వివిధ రకాల కూరగాయలతో శాకంబరీమాతగా అలంకరణ చేశారు. అనంతరం మహిళా భక్తులు లలితా పారాయణం చేశారు. కార్యక్రమంలో మహిళా భక్తులు గేలం ఉమాదేవి, పిన్నమని సత్యానాగిని, గేలం సూర్యకుమారి, మేన్ని ప్రభావతి, చిట్లు ధనలక్ష్మి, చిట్లు గజ్జలకుమారి, జక్కుల రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

### ఆలిండియా క్రిస్టియన్ జేఏసీ జాతీయ కన్వీనర్ నియామకం

కొవ్వూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా క్రిస్టియన్ జేఏసీ జాతీయ కన్వీనర్‌గా కొవ్వూరుకు చెందిన బొంతా శ్యామ్‌రవిప్రకాష్‌ను నియమిస్తూ క్రిస్టియన్ సేవా సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల బీ.రాజు నియామక పత్రాలను అందించారు. దేశ వ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు, మత స్వేచ్ఛ హక్కులను కాపాడుకుంటూ రాజ్యాంగ పరిరక్షణకు పూర్తి స్థాయిలో పనిచేస్తానని ఆయన తెలిపారు.

### కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం

**● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**


నందిగంపాడులో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిగంపాడులో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం కరపత్రాను పంపిణీ చేశారు. తర్వాత పలువురు నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నందిగం సూర్యారావు, కామేశ్వరరావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం : ఎంపీ

తాళ్లపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మండలంలో శుక్రవారం సీసీ రోడ్లు, డ్రైన్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనికి ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ విచ్చేశారు. ముందుగా పెద్దేవంలో రైతులకు రాయితీపై వ్యవసాయానికి సంబంధించిన యంత్ర పరికరాలను రైతులకు అందించారు. ఎంపీ మాట్లాడుతూ తాళ్లపూడి, అన్నదేవరపేట, పెద్దేవం, వేగేశ్వరపురంలో వాటర్ ట్యాంకులకు ఆర్‌డబ్ల్యూఎస్ జేజేఎం నిధులు రూ. కోటి 55 లక్షల 90 వేలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. కోటి 13 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ మండలంలో రూ. రెండు కోట్ల 69 లక్షలతో విలువైన పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్య దేవర రంజిత్, గొరిజాల వెంకట


పెద్దేవంలో పనులకు శంకుస్థాపన చేస్తున్న రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి

ప్రసాద్(జీవీ), నాయన పరమేశ్వరరావు, కైగాల శ్రీనివాస్, కోడి శంకరం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మండలాధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, జనసేన గంటా శివరామకృష్ణ, గాళ్లపూడి సర్పంచ్ నక్కా అనురాధ, ఉప సర్పంచ్ అప్పన జగదీష్, ఆర్డీవో రాణీసుస్మిత, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పార్వతి, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఏవో రుచిత, కాంట్రాక్టర్ డీవీవీ సత్యనారాయణ, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ‘ఉపాధి’ కల్పించడంలో ‘ఏబీఎన్’ ముందంజ

**●కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్**

కొవ్వూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించటంలో కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ కళాశాల ముందంజలో ఉందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామ్మోహన్ తెలిపారు. దీనికి కళాశాల విద్యార్థులు సాధిస్తున్న విజయాలే నిదర్శనమన్నారు. కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతూ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో 21, విప్రోలో ఆరుగురు, ఇన్ఫోసిస్‌లో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు, శిక్షణ అందించిన అధ్యాపకులను శుక్రవారం కళాశాలలో అభినందించారు. కార్యక్రమంలో ప్రాంగణ ఎంపికల అధికారి కే.సూరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రమేష్, సీహెచ్ దయాకర్, శివన్నారాయణ, కే.రామకృష్ణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

### మహిళా పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం మంగాయమ్మ

తాళ్లపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మహిళా పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సును ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో జిల్లా లఘు పరిశ్రమల శాఖ ఎంఈపీడీఏ శ్రీనివాస్, డీఆర్‌డీఏ సెర్ప్ డీపీఎం జనార్దన్, ఏపీఎం మంగాయమ్మ పాల్గొని కొత్తగా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకోవాలనుకునే మహిళలకు వారి వ్యాపార అభివృద్ధికి కావాల్సిన యూనిట్లపై అవగాహన కల్పించారు. పలు బ్యాంకుల మేనేజర్లు, మండల సమాఖ్య సీసీలు, వీవోఏలు, మండల సమాఖ్య ప్రతినిధులు, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

### పెద్దేవంలో యువకుల నిరసన

తాళ్లపూడి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేవంలో ఆర్ అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న ఇళ్ల ముందు డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తామని స్థానిక పంచాయతీ అధికారులు, నాయకులు తమ ఇంటి ముందు ఉన్న అరుగులు కొట్టి వేశారని, అయితే నేటికీ ఆ పనులకు శ్రీకారం చుట్టలేదని గ్రామానికి చెందిన యువకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలానికి వచ్చిన ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకి వినతిపత్రాలు అందించి తమ సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశారు. పెద్దసంఖ్యలో యువత పాల్గొన్నారు.


గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న యువకులు

### ఖండవల్లి బాలుర వసతిగృహం తనిఖీ


శానిటేషన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

పెరవలి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఖండవల్లి ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మాస్ శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కేయూఆర్‌ఎల్ పద్మజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో హాజరుశాతం ఎంత, వసతులు ఎలా ఉన్నాయన్న దానిపై ఆరా తీశారు. కిచెన్ పరిశుభ్రంగా ఉందా లేదా అని చూశారు. కార్యక్రమంలో వార్డెన్ ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రాభివృద్ధికి సీఎం అహర్నిశలు కృషి : ఎమ్మెల్యే


ఆవుపాడులో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, జూలై18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. అచ్చెన్నపాలెం, ఆవుపాడు, సింగరాజపాలెంలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అటు సంక్షేమం, ఇటు అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటోందన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, హజ్ కమిటీ డైరెక్టర్ మీరా సాహెబ్, మండల అధ్యక్షుడు తాతిన సత్యనా రాయణ, అచ్యుత వెంకటేశ్వరరావు, భోగినీడు వెంకట్రావు, అచ్యుత మధుసూదనరావు, తూముల శ్రీను, చామన వెంకట సుబ్బారావు, దొండపాటి శరత్, యర్రా పెదకాపు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ‘బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం’



కొవ్వూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది, పెరవలి : బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సులో బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏ. ఆదిలక్ష్మి తెలిపారు. శుక్రవారం వేములూరు దొరయ్యచెరువు అంగన్వాడీ కేంద్రంలో బాల్య వివాహ నిషేధ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్య వివాహ నిషేధ చట్టం - 2006 గురించి ఆమె వివరించారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు ఎదురవుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్. దివ్యశ్రీ, ఏఎన్ఎం కే.రాజులత, అంగన్వాడీలు బీ.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

**పెరవలి:** మండలంలోని అజ్జరం, ఉసులుమర్రులోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్యవివాహాలపై శుక్రవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా కానూరు సెక్టార్ సూపర్‌వైజర్ సరోజని మాట్లాడుతూ గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండకుండా బాల్య వివాహాలు చేయకూడదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** బాల్య వివాహాలను అరికట్టాలని పెరవలి ఐసీడీఎస్ సీడీపీవో ఆశారోహిణి పేర్కొన్నారు. శుక్రవారం కాల్ధరిలో బాల్య వివాహాల నిర్మూలన కమిటీ, చిన్నారుల సంరక్షణ కమిటీల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ఈ కమిటీలు పిల్లల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన వంటి చర్యలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీపుళ్ల కుమారి, ఐసీడీఎస్ సిబ్బంది ఎం. బాలసరస్వతి, పంచాయతీ కార్యదర్శి వంగా శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. తాడిపర్రులో బాల్యవివాహాల నిర్మూలనపై కిశోర్ బాలికలకు అవగాహన కల్పించారు.

**తాళ్లపూడి:** మలకపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద పిల్లల ఆరోగ్యం బాల్య వివాహాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భానుమతి మాట్లాడుతూ యుక్తవయస్సు వచ్చి మానసిక, శారీరక ఎదుగుదల వచ్చిన తరువాత మాత్రమే ఆడపిల్లలకు వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు , తదితరులు పాల్గొన్నారు.

**నల్లజర్ల:** ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండే వరకు వివాహం చేయడం నేరమని ఐసీడీఎస్ దూబచర్ల సెక్టార్ సూపర్‌వైజర్ హారతి అన్నారు. శుక్రవారం సింగరాజుపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరబాలికలకు బాల్యవివాహాలపై తల్లులకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు జరిగే సమయంలో తమకు సమాచారం ఇచ్చి వాటిని అరికట్టేందుకు సహాయపడాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు పద్మజ, చంద్రావతి, రత్నకుమారి పాల్గొన్నారు.


ఉండ్రాజవరం: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఆశారోహిణి


తాళ్లపూడిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భానుమతి

## మూడో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

కొవ్వూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారంతో మూడో రోజుకు చేరుకుంది. దీనిలో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎల్ఐసీ, జూనియర్ కాలేజీ మీదుగా సమ్మె శిబిరం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ జేఏసీ చైర్మన్ నక్కా వెంకటరత్నం, సీఐటీయూ నేత పి.గంగాధరరావు సమ్మె శిబిరానికి చేరుకుని కార్మికులకు మద్దతు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్ శిబిరం వద్దకు వచ్చి ప్రభుత్వం కార్మికుల పట్ల సానుకూలంగా ఉందని, సమ్మె విరమింపజేయాలని, లేనిచో చర్యలు తప్పవని యూనియన్ నాయకులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా .. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇచ్చినమాట తప్పిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని, సమ్మె విరమింపజేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు రాజాన అప్పారావు, సీఐటీయూ నేత సుందరబాబు, కార్మికులు బీ. రవీంద్ర, పీ. వాసు, కే.రాజేష్, జ్యోతి, వెంకటలక్ష్మి, వాణి పూర్ణ , తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

## కాలుష్యరహిత వాతావరణం అవసరం

**● బౌద్ధధమ్మ పీఠాధిపతి అనాలయో**


మోర్త శ్మశానవాటికలో మొక్కలు నాటుతున్న అనాలయో

ఉండ్రాజవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ కాలుష్యరహిత వాతావరణం అవసరమని ఉండ్రాజవరం బౌద్ధధమ్మ పీఠాధిపతి అనాలయో పేర్కొన్నారు. శుక్రవారం మోర్త శ్మశానవాటికలో బౌద్ధ ధమ్మపీఠం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా అనాలయో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవుడుకి చివర మజిలీ వరకు కాలుష్య రహిత వాతావరణం అవసరమని చెప్పారు. అందుకే తాము శ్మశానవాటిక ప్రాంగణంలో సైతం నీడనిచ్చే మొక్కలు నాటుతున్నట్టు తెలిపారు. భావి తరాలకు మనం అందించే సంపద కాలుష్య రహిత వాతావరణమేనని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కంటిపూడి నరేంద్ర, అనపర్తి జలమయ్య, రాచమళ్ల శ్రీనివాసరావు, దాసరి సుబ్రహ్మణ్యం, నిడుమోలు చిన్నరాము, కరుటూరి వెంకటదొరప్రసాద్, వడ్డి వెంకటేశ్వరరావు, ఏ.సత్యానారాయణ, కంటిపూడి రాంబాబు, కొప్పినీడి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### బోధనేతర పనులు రద్దు చేయాలి: యూటీఎఫ్


విలేకరులతో మాట్లాడుతున్న జయకర్

నల్లజర్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని, లేకపోతే విధులు బహిష్కరిస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న యూటీఎఫ్ సభ్యత్వ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత నెలలో జరిగిన యోగా దినోత్సవం, ఈనెలలో జరిగిన మెగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొనడంతో దాదాపు 10 రోజులపాటు బోధనా సమయం వృథా అయ్యిందన్నారు. కార్యక్రమంలో ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయడం, తల్లిదండ్రుల హాజరు నమోదు చేయడం వంటి పనులు ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేశాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మనోహర్ కుమార్, భవాని, అలీఅహ్మద్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.